తీన్మార్
విలేకరులు కావలెను
పత్రిక రంగంలో మరో సంచలనం, వినూత్న రీతిలో వెలువడతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో పని చేయుటకు
జిల్లా బ్యూరో చీఫ్ లు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు,
జిల్లా క్రైమ్ రిపోర్టలు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించగలరు
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత, కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.
ఈ క్రింది నెంబర్ల ను ఫోన్ ద్వారా లేదా వాట్సప్ ద్వారా సంప్రదించగలరు
9177108128, 9966847463


# తీన్మార్
నేటి వాస్తవాలు ... తెలుగు దిన పత్రిక
teenmaardesk@gmail.com

for e-paper scan now

ములుగు | సంపుటి : 02 | సంచిక : 267 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 6 జనవరి 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## కొత్త హైకోర్టు కోసం 100 ఎకరాల భూమిని కేటాయింపు

జీవో జారీ చేసిన తెలంగాణ సర్కార్



2 లో..

## బీఆర్ఎస్ నేతలు మాట్లాడే నైతిక హక్కును కోల్పోయారు

బిఆర్ఎస్ నాయకులపై విమర్శలు గుప్పించిన మంత్రి కొండా సురేఖ



2 లో..

## నామినేటెడ్ ఎమ్మెల్సీల తిరస్కరణపై హైకోర్ట్ విచారణ

జనవరి 24కు హైకోర్టు వాయిదా



2 లో..

## కేసీఆర్ కిట్ పేరు మార్చిన రేవంత్ సర్కార్

కేసీఆర్ పేరిట పథకాల పేర్ల మార్పుకు సర్కార్ నిర్ణయం



2 లో..



కొత్త అప్పుల కోసం దిక్కులు చూస్తున్న రాష్ట్రం

# మోదీ కనికరిస్తేనే బండి కదిలేది!

13 వేల కోట్ల రుణానికి అనుమతి ఇవ్వండి

ప్రధానికి విజ్ఞప్తి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

డిసెంబర్‌లో బాండ్లపై 1400 కోట్లు రుణాలు

ఎన్నికలప్పుడు రైతుబంధు జమకు సిద్ధమైన నాటి బీఆరెస్ ప్రభుత్వం

ఫలితాలు వచ్చేనాటికి ఖజానా ఖాళీ

తెలంగాణ బ్యూరో, జనవరి 05 (తీన్మార్ న్యూస్) : మోదీ కనికరిస్తేనే బండి కదిలే దారుణమైన పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి ఏర్పడింది. గత ప్రభుత్వం అందిన కాడికి అప్పులు గుంజుకొచ్చి ఖర్చు చేసి, ఖాజానా అంతా ఊడ్చేసింది. ఏ రోజుకారోజు చిల్లర ఖర్చుకు కూడా వెంపర్లాడాల్సిన దుస్థితి కలిగింది. కాగ్ విడుదల చేసిన నవంబర్ 30 నాటికి జమా ఖర్చుల వివరాలు రాష్ట్ర ఆర్థిక దుస్థితికి అద్దం పడుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి బారోయింగ్

మిగతా 2 లో

# ఏసీబీకి చిక్కిన కేయు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య



పలు అనుమానాలకు తావిస్తున్న పాల వ్యాపారి నుంచి రూ.50 వేలు లంచం

కిష్టయ్యపై పలు అవినీతి ఆరోపణలు, విచారణ ఉండటం గమనార్హం

వెనుక ఉన్న అవినీతి తిమింగాలలపై కొనసాగుతున్న ఏసీబీ విచారణ

2





# రాజ్‌నాథ్‌సింగ్‌తో ముగిసిన సీఎం రేవంత్ రెడ్డి భేటీ

సైనిక్ స్కూల్ మంజూరు, రాష్ట్ర బకాయిలపై చర్చించినట్లు సమాచారం

.. వివరాలు 2లో

## ధరణిపై కీలక నిర్ణయం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు

భూముల యాజమాన్య హక్కు కల్పించుటలో మొదలైన చర్యలు

భూముల వివరాలు విదేశీ సంస్థకు అప్పగించడం మంచిది కాదని అభిప్రాయం



2లో..



# మాజీ మంత్రిపై కబ్జా ఆరోపణలు

ప్రజాభవన్ వద్ద మల్లారెడ్డి బాధితుల ఆందోళన

పేద ప్రజల పట్ల యముడిలా మారారంటూ ప్లకార్డుల ప్రదర్శన

.. వివరాలు 2లో

## నన్ను చంపే ప్రయత్నం జరిగింది

దేవుడి దయవల్ల బతికి బయట పడినట్లు స్పష్టం

కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు



.. వివరాలు 2లో

# మోదీ కనికరిస్తేనే బండి కదిలేది!

### మొదటి పేజీ తరువాయి

ద్వారా కానీ, కేంద్రం వద్ద నేరుగా కానీ కలిపి రూ.42,254 కోట్లు రుణం తీసుకోవడానికి గత ప్రభుత్వం అసెంబ్లీ అనుమతి తీసుకున్నది. వాస్తవంగా రిజర్వ్ బ్యాంకు వద్ద ఏడాది పొడవునా మార్చి 2024 వరకు మార్కెట్ బారోయింగ్ అప్పులు రూ.38,234.94 కోట్లు తెచ్చుకోవడానికి అనుమతి ఉండగా నవంబర్ 30 నాటికే రూ.38,151.01 కోట్ల అప్పులు తీసుకున్నది. ఇవి కాకుండా కొద్ది మొత్తంలో కేంద్రం నుంచి రుణం తీసుకోవడానికి అనుమతి ఉంది. కాగా ఈ రుణాలు కూడా తీసుకున్నట్లు కనిపించడం లేదు.

**ఫలితాల వెల్లడినాటికే ఖజానా ఖాళీ**

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలోనే గత ప్రభుత్వం రూ.4872.67 కోట్లు రిజర్వ్ బ్యాంకు వద్ద మార్కెట్ బారోయింగ్ రుణం తీసుకున్నది. నవంబర్ 30న పోలింగ్ ముగిసింది. డిసెంబర్ 3వ తేదీన జరిగిన ఓట్ల లెక్కింపులో బీఆరెస్ ఓడి కాంగ్రెస్ గెలిచింది. డిసెంబర్ 7న కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టింది. తీరాచూస్తే అప్పటికే ఖజానా ఖాళీగా ఉంది. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై మొదటి క్యాబినెట్‌లో తీర్మానం చేసినప్పటికీ నిధులు వచ్చే మార్గం లేక, అప్పులు తెచ్చుకోవడానికి ఉన్న అవకాశాలపై కూడా అధికారులు సమాధానం చెప్పలేక పోవడంతో వెంటనే అమలు చేయలేక పోయారు. నగదును వెంటనే చెల్లించాల్సిన అవసరం లేని రెండు గ్యారెంటీలు మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, రూ.10 లక్షల ఆరోగ్య బీమా పథకాలను ప్రకటించి అమలు చేసింది. మిగతా గ్యారెంటీలను వంద రోజుల్లోగా అమలు చేస్తామని ప్రకటించింది.




**పథకాలకు నిధులెలా?**

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారెంటీ పథకాల అమలుకు ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోంది. కానీ వీటికి ఏవిధంగా నిధులు సమకూర్చాలా? అన్నది సీఎం రేవంత్‌రెడ్డికి, ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు సవాల్‌గా మారింది. వాస్తవంగా డిసెంబర్ 9వ తేదీన రైతు బంధు సొమ్ము అంతా రైతుల ఖాతాల్లో పడుతుందని ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి వాగ్దానం చేశారు. దీనికి ముందు మాజీ అర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు రైతు బంధు డబ్బులన్నీ జమచేసి ఉంచామని, బ్యాంకు ఖాతాలో వేస్తామని ప్రకటించారు. కానీ ఎన్నికల తరువాత చూస్తే ఆ డబ్బులన్నీ ఎటు పోయాయో కానీ కొత్త ప్రభుత్వానికి ఖజానా ఖాళీగా దర్శనమిచ్చింది. ముందుగానే ఫలితాలపై అంచనాకు వచ్చిన నాటి ప్రభుత్వ పెద్దలు రైతు బంధు కోసం ఉంచిన సొమ్మును తమకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేశారన్న ఆరోపణలు కూడా వినిపించాయి. రైతు బంధు కోసం నిల్వ చేసిన డబ్బు ఏమైందో కానీ సీఎంగా బాధ్యతలు తీసుకున్న రేవంత్ రెడ్డికి ఖజానా మాత్రం ఖాళీకుండలా దర్శనం ఇచ్చింది. దీంతో రిజర్వ్ బ్యాంకు వద్ద ఏదో చేసి డిసెంబర్ నెలలో రూ.1400 కోట్లు తీసుకు వచ్చి బండి నడిపించారు. బీఆరెస్ సర్కారుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం నెల మొదట్లోనే ఉద్యోగులకు జీతాలిచ్చింది. కానీ జనవరి నుంచి మార్చి వరకు బండి నడపడమే కాదు.. హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఉంది. అసలే పార్లమెంటు ఎన్నికలు ముంచుకు వస్తున్నాయి. ఎన్నికల ముంగిట హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మని పరిస్థితి ఏర్పడింది. ఇది పార్లమెంటు ఎన్నికలపై తీవ్ర ప్రభావాన్నిచూపే ప్రమాదం ఉంది. దీంతో ఎలాగైనా ఈ హామీలను అమలు చేయాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని అధికారులు చెబుతున్నారు.

**ప్రత్యేక అనుమతుల కోసం వినతి**

హామీల అమలు తొలి ప్రాధాన్యంగా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. రుణాల కోసం ప్రత్యేకంగా అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీని రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా కలిశారు. సిద్ధాంతపరంగా వేర్వేరు రాజకీయ పార్టీలైనప్పటికీ తెలంగాణ ప్రజల కోసం తమకు అనుమతివ్వాలని అడిగారు. ఈ మేరకు జనవరి 9వ తేదీ నుంచి మార్చి 26వ తేదీ వరకు ఏ తేదీన ఎంత మేరకు రుణం అవసరం ఉంటుందో తెలియజేస్తూ మొత్తం రూ.13 వేల కోట్లు అవసరం అవుతుందని కేంద్రానికి ఇండెంట్ పెట్టారు. ఈ ఇండెంట్ రిజర్వ్ బ్యాంకు వద్ద ఉన్నది. దీనికి కేంద్రం అనుమతిస్తే రేవంత్ రెడ్డి సర్కారుకు నిధుల కొరత కొంతమేర తీరుతుంది. ఇవికాకుండా మరో రూ. 5 వేల కోట్లు పబ్లిక్ అకౌంట్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా తీసుకోవడానికి అవకాశం ఉంది. ఈ రెండు రకాల అప్పులు కలిసి రూ.18 వేల కోట్ల వరకు నిధులు అందుబాటులోకి వస్తే పథకాల అమలు సులువు అవుతుందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే రాజకీయ వైరుధ్యాలు పక్కకుపెట్టి ప్రధాని నరేంద్ర మోదీ అప్పులకు అనుమతి ఇస్తారా? లేదా? అన్నది వేచి చూడాలి.

## నన్ను చంపే ప్రయత్నం జరిగింది



తెలంగాణ బ్యూరో, జనవరి 05 (తీన్మార్ న్యూస్): గత నెల డిసెంబర్ 25న తనను చంపే ప్రయత్నం జరిగిందని ప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే క్రిస్మస్ పండుగనాడు తనకు ఫుడ్ పాయిజనింగ్ ఇచ్చారని వెల్లడించారు. ప్రస్తుతం విశాఖపట్నంలో ట్రీట్ మెంట్ తీసుకుంటున్నానని తెలిపారు. దేవుడి దయవల్ల ఫుడ్ పాయిజన్ నుంచి బతికి బయట పడినట్లు స్పష్టం చేశారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఇలా జరిగిందని శుక్రవారం ఓ ఆడియోతో మీడియాకు తెలిపారు.

## ధరణిపై కీలక నిర్ణయం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు

తెలంగాణ బ్యూరో, జనవరి 05 (తీన్మార్ న్యూస్): గత ప్రభుత్వం రూపొందించిన ధరణిపై మరో కీలక నిర్ణయం దిశగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ధరణి రికార్డులను ఒక సింగపూర్ కి చెందిన టెర్రాసిస్ అనే ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోంది. ఇప్పుడు ఆ సంస్థను తప్పించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సంస్థలకు ఆ బాధ్యతలను ప్రభుత్వమే చేపట్టేందుకు కసరత్తు చేస్తుంది. ఎన్ఐసీ, టీఎస్టీఎస్ సీజీజీ లలో ఏదో ఒక దానికి ధరణి నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సర్కారు భావిస్తున్నట్లు సమాచారం. అందుకు గాను ఇటీవలే ఆయా సంస్థలను అధికారులు సంప్రదించినట్లు తెలుస్తుంది. ధరణిలో 83 లక్షలకు పైగా వ్యవసాయ ఖాతాలు ఉన్నాయి. వీటితో పాటు నిషేధిత భూముల వివరాలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సంబంధించిన భూములు సమాచారం కూడా ధరణి పోర్టల్లో ఉంది. అయితే వాస్తవానికి 2018లో భూ రికార్డుల ప్రక్షాళన సమయంలోనే ఇంటి గ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్మెంట్ సిస్టమ్ కు సాఫ్ట్ వేర్ డిజైన్, డెవలప్మెంట్, ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. ఆ తర్వాత ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్మెంట్ సిస్టమ్ పేరును బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 నవంబరు 2న ధరణి పోర్టల్ గా మార్చింది. ఇక అప్పటి నుంచి ఈ పోర్టల్ ద్వారానే భూములకు యాజమాన్యం హక్కులు కల్పించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సంస్థ నిర్వహణ బాధ్యతల కాంట్రాక్ట్ గత ఏడాది సెప్టెంబరులో ముగిసినా కానీ మళ్లీ అదే సంస్థకు బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. అయితే కోట్ల విలువ చేసే భూముల వివరాలు విదేశానికి చెందిన ప్రైవేట్ సంస్థ చేతిలో ఉండడం మంచిది కాదన్న అభిప్రాయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఈ మేరకు ధరణి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వ సంస్థలకే అప్పగించాలని భావిస్తోంది.

దాంతో ప్రభుత్వ, ప్రైవేట్ భూరికార్డులు, రైతుల వివరాలు, ఇతర సమాచారం భద్రంగా ఉంటుందని, ఎలాంటి అక్రమాలకు తావుండదని అంచనా వేస్తోంది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా ధరణి ద్వారా జరిగే భూ క్రయవిక్రయాలు మినహా.. మరే ఇతర కార్యకలాపాలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. 33 రకాల టెక్నికల్ మాడ్యుల్స్ కింద వచ్చే దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పూర్తిగా ఆపేసింది. ఈ నేపథ్యంలోనే ధరణి పేరును భూమాతగా మార్చి.. పోర్టర్ లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనసాగించాలని కాంగ్రెస్ సర్కార్ యోచిస్తోంది.

## ఏసీబీకి చిక్కిన కేయు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య

హన్మకొండ కేయు, జనవరి 05 (తీన్మార్ న్యూస్): 50 వేల లంచం తీసుకుంటూ కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య శుక్రవారం ఏసీబీకి చిక్కారు. కేయూలో కీలక బాధ్యతల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య పనిచేస్తున్నారు. ఏ.ఆర్ కిష్టయ్యను ఈ మధ్యనే ఆర్ట్స్ కాలేజీ నుంచి క్యాంపస్‌కు వీసీ ప్రో.రమేష్ బదిలీ చేశారు. విద్యార్థుల ట్యూషన్ ఫీజులు, ఇతర రుసుముల స్వీకరణలో జరిగిన రూ. 3 కోట్ల కుంభకోణంపై కిష్టయ్య, ప్రిన్సిపాల్ బన్న అయిలయ్యపై విచారణ కమిటీ ఉండగానే ఏ.ఆర్ కిష్టయ్యను క్యాంపస్‌కు వీసీ రమేష్ మార్చారు. న్యాక్ కొరకు కేటాయించిన రూ.10 కోట్ల బిల్లులపై చేతి వాటం కోసమే కిష్టయ్యను క్యాంపస్ కు వీసీ రమేష్ బదిలీ చేయించారని గతంలో ఆరోపణలు వచ్చాయి. యూనివర్సిటీలో కీలకమైన నాలుగు కార్యాలయాలకు కిష్టయ్యను ఒక్కడినే అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా వీసీ నియమించారు. న్యాక్ సందర్భంగా కాకతీయవర్సిటీలో రోడ్లు, హాస్టళ్లు, ఇతర బిల్డింగ్‌ల కోసం రూ.10 కోట్లు కేటాయించారు. ఇందులో కమీషన్ల కొరకే బిల్డింగ్ డివిజన్, పబ్లికేషన్స్ సెల్, హాస్టల్ ఆఫీస్‌లతో పాటు యూనివర్సిటీ ఆడిట్ ఆఫీస్‌కు కూడా కిష్టయ్యనే అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా నియమించారు. హాస్టల్‌లోనే ఓ పాలు అమ్మే వ్యాపారి దగ్గరి నుంచి రూ.50 వేలు లంచం తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఇంకా దీని వెనుక వీసీ రమేష్ లాంటి పెద్ద పెద్ద తిమింగలాలు ఉన్నాయనే రీతిలో ఏసీబీ విచారణ జరుపుతుంది.






## కొత్త హైకోర్టు కోసం 100 ఎకరాల భూమిని కేటాయింపు

హైదరాబాద్, జనవరి 05 (తీన్మార్ న్యూస్) : తెలంగాణలో నిర్మించబోయే కొత్త హైకోర్టు కోసం 100 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం తెలంగాణ సర్కార్ జీవో జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం ప్రేమావతి పేట్ , బుద్వేల్ గ్రామం పరిధిలో ఉన్న 100 ఎకరాలను హైకోర్టు ప్రాంగణం కోసం కేటాయిస్తున్నట్లు జీవో నెంబర్ 55లో పేర్కొంది. కిందటి నెలలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు ఎంసీహెచ్ఆర్‌డీలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిశారు. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో.. కొత్తది నిర్మించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో కొత్త హైకోర్టు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. కొత్త భవనం నిర్మాణం జరిగే వరకు హైకోర్టు కార్యకలాపాలు పాత భవనంలోనే జరుగుతాయి. ఆ తర్వాత హెరిటేజ్ భవనంగా పరిరక్షించాలని సర్కార్ భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న భవనాన్ని సిటీ కోర్టుకు లేదంటే మరేదైనా కోర్టు భవనానికి వాడుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇదివరకే చీఫ్ సెక్రటరీ శాంతికుమారిని ఆదేశించారు.

## బీఆర్ఎస్ నేతలు మాట్లాడే నైతిక హక్కును కోల్పోయారు

హన్మకొండ, జనవరి 05 (తీన్మార్ న్యూస్): గత తొమ్మిదిన్నరేళ్ల పాటు ప్రజల సొమ్మును పందికొక్కుల్ల మేసి అడ్డగోలుగా దండుకున్న బీఆర్ఎస్ నేతలు తెలంగాణ ప్రజల గురించి మాట్లాడే నైతిక హక్కును కోల్పోయారని మంత్రి కొండా సురేఖ తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం ఆమె నివాసంలో మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం తొమ్మిదిన్నర ఏండ్లలో అమలు చేయలేని కనీస అవసరాలను నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుంటే.. జీర్ణించుకోలేక కేటీఆర్ చిల్లర మాటలు.. చిల్లర విమర్శలు చేస్తున్నాడని మండిపడ్డారు. కేటీఆర్ మాట్లాడే ముందు కొంచమైనా ఆలోచించి మాట్లాడితే బాగుంటదని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేల కూడా కాలేదు.. కనీసం 100 రోజులు కూడా సమయం ఇవ్వకుండా అప్పుడే 100 రోజుల్లో ప్రభుత్వం పడిపోతుందని అనడం ఏంటని ఫైర్ అయ్యారు. ప్రభుత్వం కూలిపోతుంది అంటే తెలంగాణలో మళ్ళీ ఎలక్షన్‌లు వస్తయా..?ప్రజలను ఎందుకు తప్పుతోవ పట్టిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రజలను లైన్లలో నిలబెట్టి.. ప్రతి రోజు ప్రజలను గోస పెడుతున్నామని కేటీఆర్ మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమని.. గడీలు, ఫామ్ హౌజ్లో ఉన్న కేసీఆర్, కేటీఆర్‌కు ఇప్పుడు ప్రజల బాధలు కనిపిస్తున్నాయా..? అని నిలదీశారు.

## నామినేటెడ్ ఎమ్మెల్సీల తిరస్కరణపై హైకోర్ట్ విచారణ

హైదరాబాద్, జనవరి 05 (తీన్మార్ న్యూస్): గత బీఆర్ఎస్ ప్రభుత్వం నామినేట్ చేసిన ఎమ్మెల్సీలను తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించిన విషయంలో దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఎమ్మెల్సీల తిరస్కరణపై దాశోజు శ్రవణ్, సత్య నారాయణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై నేడు హైకోర్టు విచారణ జరిపింది. శ్రవణ్, సత్యనారాయణ తరుపు న్యాయవాదులు ఆర్టికల్ 171 ప్రకారం క్యాబినెట్ నిర్ణయాన్ని గవర్నర్ ఆపడానికి వీలు లేదని హైకోర్టుకు తెలియజేశారు. అయితే ఆర్టికల్ 361 ప్రకారం పిటిషనర్ల పిటిషన్‌కు అర్హత లేదని గవర్నర్ తరుపు కౌన్సిల్ కోర్టుకు తెలిపారు. పిటిషన్ మెంటేనబిలిటీపై విచారణ జరుపుతామని హైకోర్టు పేర్కొంది. కాగా తదుపరి విచారణ జనవరి 24కు హైకోర్టు వాయిదా వేసింది.

## కేసీఆర్ కిట్ పేరు మార్చిన రేవంత్ సర్కార్

హైదరాబాద్, జనవరి 05 (తీన్మార్ న్యూస్): గత పదేళ్లుగా తెలంగాణలో రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటమే కాకుండా కేసీఆర్ పేరుతో ఎన్నో పథకాలు అమలు చేయడంతో ఆ పేరు బాగా వినిపించింది. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించిన కాంగ్రెస్ రాష్ట్రంలో ఆయన పేరు కూడా వినిపించకుండా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే కేసీఆర్ పేరిట ఉన్న పథకాలను మారుస్తూ రేవంత్ సర్కార్ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మాతా శిశు సంక్షేమం కోసం కేసీఆర్ కిట్‌ను పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం జరిగితే తల్లికి, అప్పుడే పుట్టిన బిడ్డకు ఉపయోగపడే వస్తువులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తూవచ్చింది. పేద మధ్యతరగతి తల్లులను ఆదుకోవాలనే ఉద్దేశం మంచిదే అయినప్పటికీ కేసీఆర్ కిట్ పేరు, ఫొటోపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తాజాగా కేసీఆర్ కిట్ పేరు మారుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి కేసీఆర్ కిట్ పేరును మాతా శిశు ఆరోగ్యం (ఎంసీహెచ్)గా మారుస్తున్నట్లు తెలంగాణ ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే కిట్ బ్యాగులపై కేసీఆర్ పేరు, ఫొటోలతో కూడిన ఎంసీహెచ్ స్టిక్కర్లు అతికించి పంపిణీ చేస్తున్నారు.

## రాజ్‌నాథ్‌సింగ్‌తో ముగిసిన సీఎం రేవంత్ రెడ్డి భేటీ

ఢిల్లీ, జనవరి 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో శుక్రవారం పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ భేటీలో తెలంగాణకు సైనిక్ స్కూల్‌ను మంజూరు చేయాలని కేంద్రమంత్రిని సీఎం కోరినట్లు తెలుస్తోంది. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలపై కేంద్రమంత్రితో సీఎం చర్చించారు. ఈ పర్యటనలో సీఎం రేవంత్ వెంట, మంత్రి ఉత్తమ్, సీఎస్ శాంతకుమారి పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.

## మాజీ మంత్రిపై కబ్జా ఆరోపణలు




హైదరాబాద్, జనవరి 05 (తీన్మార్ న్యూస్): ప్రజాభవన్ వద్ద మల్లారెడ్డి బాధితులు ఆందోళన చేపట్టారు. ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించి తమ భూములను మాజీ మంత్రి కబ్జా చేశారని ఆరోపించారు. తమకు 360 ప్లాట్లు ఉంటే అందులో 110ప్లాట్‌లను కబ్జా చేశారని అంటున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. గత ప్రభుత్వం తమను పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లారెడ్డి పేదలకు నిలువు నీడ లేకుండా చేశారని బాధితులు మండిపడ్డారు. పేద ప్రజల పట్ల యముడిలా మారారంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తామని చెప్పారు బాధితులు. కబ్జా చేసిన భూములను తిరిగి ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. వందమందికి పైగా మల్లారెడ్డి బాధితులు ఉన్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. మల్లారెడ్డి రౌడీలతో భయపెట్టారని బాధితులు ఆరోపించారు. భూములు కబ్జా చేసి ధరణిలో నమోదు చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# రైతుల బలవన్మరణాలకు కారణాలు

దేశంలో కార్పొరేట్ సంస్థల అధిపతులు ప్రపంచ ధనవంతులజాబితాలో స్థానం పొందితే, దేశానికి అన్నంపెట్టే రైతులు మాత్రం ఆత్మహత్యల జాబితాలోకి చేరుతున్నారు. ఈ జాబితా నిరంతరం పెరుగుతూ వుండి ప్రజాతంత్రవాదులు, రైతాంగ ప్రయోజనాలు కోరుకునే మేధావులు, జర్నలిస్టులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎవరు కాదన్నా, ఔనన్నా భారత దేశం వ్యవసాయక దేశం. 68% ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి వున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో నేడు కూడా 14.5% వాటా కలిగి వుంది. 2020 లెక్కల ప్రకారం దేశ మొత్తం కార్మికుల్లో 41.48% వ్యవసాయ కూలీలుగా వున్నారు. భారత దేశంలో జరిగిన మొత్తం ఆత్మహత్యల్లో దాదాపు 12% రైతుల ఆత్మహత్యలు వున్నాయి. దాదాపు 68%మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పిస్తున్న దేశ వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోవడానికి, రైతులు బలవన్మరణాల పాలు కావడానికి కారణమేమిటి? ఆ కారణాలు తెలిసినప్పుడే సంక్షోభ మూలాలు అర్థమవుతాయి. బ్రిటీష్ వలస పాలకుల నుండి అధికారాన్ని చేతులు మార్చుకున్న దేశీయ పాలకులు సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు, విదేశీ గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూలమైన విధానాలు అధికార మార్పిడితోనే ప్రారంభించారు. దేశీయ బడా బూర్జువా వర్గం సామ్రాజ్యవాదానికి దళారీవర్గంగా వలస పాలన దగ్గర నుంచి నేటి వరకు పని చేస్తూనే వుంది. దేశానికి వెన్నెముకగా వున్న వ్యవసాయ రంగాన్ని దేశీయ ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించడానికి మన వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. 1951 సెప్టెంబర్ 27 న వ్యవసాయ శాఖ నిర్వహించిన సదస్సు లో దేశంలోని భూములు, పంటలు, వాతావరణాలను పరిగణనలోకి తీసుకుని భారతీయ వ్యవసాయాన్ని పునరుజ్జీవింప చేయడానికి కార్యక్రమం రూపొందించారు. ప్రతి గ్రామంలోని ప్రతి చెలకను పరిగణనలోకి తీసుకోవడం అత్యంత అవసరమని గుర్తించారు. భారత దళారీ పాలకులు అలాంటి విధానాలు అమలు జరపకుండా సామ్రాజ్యవాదుల ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుకూలమైన విధానాలు ప్రవేశపెట్టారు. అమెరికా నమూనా వ్యవసాయాన్ని భారత దేశంలో ప్రవేశపెట్టటానికి అమెరికా ఫౌండేషన్లు, అమెరికా ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు ముఖ్యమైన పాత్రను నిర్వహించాయి. వ్యవసాయ విస్తరణలోనూ 1952 నుండి ఫోర్డ్ ఫౌండేషన్ పని చేసింది. భారత వ్యవసాయానికి సరికొత్త రూపం ఇవ్వడానికి 1953 నుండి రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ పని చేసింది. 1905లో ఏర్పాటైన భారత వ్యవసాయ పరిశోధనా సంస్థను 1958లో పునరుద్ధరించారు. 1965 లో రాక్ ఫెల్లర్ ఫౌండేషన్‌కు భారత శాస్త్రవేత్త స్వామినాథన్ డీన్ గా ఎన్నికయ్యారు. భారతీయులను అమెరికన్ సంస్థలకు పంపించడానికి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని రాక్ ఫెల్లర్ సంస్థ అందజేసింది. ఇలా వెళ్ళినవారు అమెరికా వ్యవసాయ విధానాలను ప్రచారం చేయాలి. మూడవ ప్రపంచ దేశాలకు చెందిన రైతులు, శాస్త్రవేత్తలు తమ వ్యవసాయాన్ని మెరుగుపర్చుకోగలిగే సామర్థ్యం లేని వారుగా రాక్ ఫెల్లర్ శాస్త్రవేత్తలు అవమానించారు. ఆ విధంగా భారత వ్యవసాయ రంగపై అమెరికా ఆధిపత్యానికి పునాదులు పడ్డాయి. భారత పాలకులు కూడా దేశంలోని వివిధ ప్రాంతాల వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన విత్తనాలు అభివృద్ధి చేసి ఆహార ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు రైతులను ప్రోత్సహించే విధానాలు చేపట్టలేదు. అమెరికా నుండి ఆహార ధాన్యాల దిగుమతికి ప్రాధాన్యతనిచ్చారు. దానిపై ఆహార ధాన్యాలకు ఆధారపడ్డారు. ఫలితంగా దేశం తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొంది. దాని నుండి బయటపడడానికి పిఎల్ 480 ఒప్పందం ద్వారా అమెరికా నుండి ముక్కిపోయిన గోధుమలను దిగుమతి చేసుకున్నారు. తమ కంపెనీల విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వ్యాపారం కోసం ప్రపంచ బ్యాంక్ ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు హరిత విప్లవాన్ని ప్రారంభించామని భారత ప్రభుత్వంపై అమెరికా వత్తిడి చేయించింది. 1967 -68 లో అధికారికంగా భారత దేశం హరిత విప్లవాన్ని ప్రారంభించారు. విదేశాల నుంచి హైబ్రీడ్ విత్తనాలు, ఎరువులు, తెగుళ్ల నివారణకు పురుగు మందులు దిగుమతి అయ్యాయి. హరిత విప్లవానికి ముందు వ్యవసాయోత్పత్తులు అంత తక్కువగా ఏమీ లేవు. హరిత విప్లవంలో ప్రవేశించినా విత్తనాల వల్ల ఉత్పత్తులు విపరీతంగా పెరిగిందీ లేదు. హరిత విప్లవం ద్వారా కొద్ది దిగుబడి పెరిగినా అంతకన్నా ఎక్కువగా పంట ఖర్చులు పెరిగాయి. దేశీయ విత్తనాల అభివృద్ధి ఆగిపోయింది. రసాయనిక ఎరువుల వాడకంతో భూమి గుల్లబారి సారం కోల్పోయింది. 2014 ఎన్నికల ప్రచారంలో మోడీ రైతుల గురించి అన్న మాటలు గమనిద్దాం. మన రైతులను ఉచ్చులోకి నెట్టగూడదు. రైతులు భారీ రుణాలు తీసుకోగూడదు, షావుకారు తలుపులు తట్టాల్సిన అవసరం లేదు. రైతుల రుణాలు రద్దు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా రైతుల పరిస్థితి మెరుగుపడితే వారికే కాకుండా పొలాల్లో పని చేసే చాలా మందికి ఉపాధి ఇస్తుంది. ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తే ఇవన్నీ జరుగుతాయని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపుచేస్తానని చెప్పిన మోడీ, అందుకు చర్యలు తీసుకోలేదు. దేశంలోని రైతులపై సగటు రుణభారం రూ. లక్షకు పైగా వుంది. రుణమాఫీ దేశానికి నష్టం అన్నాడు. రైతులను బడా వ్యాపారుల చేతుల్లో పెట్టే విధంగా మూడు వ్యవసాయ చట్టాలు చేశాడు. వాటిని రైతాంగం వీరోచితంగా తిప్పికొట్టారు. పాలకుల విధానాల వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతుల బలవన్మరణాలు నిరంతరం పెరుగుతూనే వున్నాయి. ప్రధాని మోడీ పాలనలో ఇంకా ఎక్కువయ్యాయి. నేషనల్ క్రైమ్ రికార్డుల బ్యూరో, భారత హోం మంత్రిత్వ శాఖ కార్యాలయం 1950 నుండి ఆత్మహత్యల గణాంకాలను నివేదికగా సేకరించి ప్రచురిస్తున్నది. వీటి లెక్కల్లో వెలుగులోకి రానివి చాలా వుంటాయి. నేషనల్ క్రైమ్ రికార్డుల బ్యూరో ప్రకారం 1995 -2014 మధ్య 2,96,438 మంది రైతులు బలవన్మరణాలకు గురయ్యారు. అత్యధికంగా మహారాష్ట్రలో 60,750 మంది రైతులు ఈ జాబితాలో వున్నారు. 2010-11లో 15,964 మంది రైతులు బలవన్మరణాలకు గురైనారు. 2001 నుండి ప్రతి సంవత్సరం 15 వేల మంది రైతులు బలవన్మరణాల పాలయ్యారు. ఆత్మహత్యలు చేసుకున్న వారిలో ఎక్కువ మంది 30 నుండి 59 సం? మధ్య వయసు గలవారే. ఆత్మహత్యలకు అత్యంత ప్రభావితమైన రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్. సరళీకరణ తర్వాత 30 సంవత్సరాల్లో 3 లక్షల, 50 వేల మంది రైతులు బలవన్మరణాలకు గురైనారు.

# బ్రాహ్మణ పరిషత్ ఉమ్మడి మండల కార్యవర్గం ఎన్నిక



పెబ్బేరు, జనవరి 05(తీన్మార్ న్యూస్): బ్రాహ్మణ కుటుంబాల్లో నిరుపేదలైనటువంటి వారికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందేలా కృషి చేస్తామని వనపర్తి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జోషి గోపి స్వామి తెలిపారు. పెబ్బేరు మండల కేంద్రంలో షిరిడి సాయిబాబా ఆలయంలో ఉమ్మడి మండల బ్రాహ్మణుల మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మీది వేముల గురు రాజాచార్యులు, ప్రధాన కార్యదర్శిగా గోవర్ధం కృష్ణ ప్రసాద్, కోశాధికారిగా నాయకంటి వెంకటేశ్వర శర్మ ను సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న వివిధ రకాలైనటువంటి సమస్యలను రాష్ట్ర బ్రాహ్మణ సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా జిల్లా సంఘ సభ్యులు కృషి చేస్తారని తెలిపారు. కొన్ని గ్రామాల్లో నేటికీ బ్రాహ్మణులు దుర్భర జీవితం అనుభవిస్తున్నారని వారికి ప్రభుత్వంతోపాటు సంఘ సభ్యులకు కూడా సహాయ సహకారాలు అందించి వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు గౌరవ సలహాదారు ఎత్తం సుధాకర్ శర్మ, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు వనపర్తి జిల్లా బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు పల్లా సాయి కుమార్ శర్మ, వనపర్తి జిల్లా బ్రాహ్మణ సమన్వయకర్త భక్షి శ్రీధర్ రావు, వనపర్తి జిల్లా బ్రాహ్మణ సంఘ సీనియర్ సభ్యులు విరివింటి అశోక్ శర్మ, మండల సభ్యులు రాంప్రసాద్, నవీన్ చార్యులు, మారుతి కులకర్ణి, చైతన్య చార్యులు, విజయ్ కుమార్, సురేష్ ఆచార్యులు, భువన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి రుజువైతే దేనికైనా సిద్ధం

- పదవి నుండి స్వచ్ఛందంగా తప్పుకుంటా
- మెజార్టీ సభ్యులు తీర్మాణం మేరకే నిర్ణయం తీసుకున్నాం
- ఏనాడు ఏకపక్ష నిర్ణయం తీసుకోలేదు...
- పదవులు అనుభవించాల్సిన అవసరం లేదు
- రామన్నపేట ఎంపీపీ కన్నెబోయిన జ్యోతిబలరాం



భువనగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 05(తీన్మార్ న్యూస్): నా మీద అవినీతి రుజువైతే దేనికైనా సిద్ధం అని రామన్నపేట ఎంపీపీ కన్నెబోయిన జ్యోతిబలరాం అన్నారు. శుక్రవారం నాడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ తన మీద పెట్టిన అవిశ్వాస తీర్మాణం పై స్పందిస్తూ అవినీతి చేసినట్టు రుజువైతే దేనికైనా సిద్ధం అని, నేనే పదవి నుండి స్వచ్ఛందంగా తప్పుకుని, ఎలాంటి చర్యలకైన సిద్దమని అన్నారు. గత పనుల విషయంలో మెజార్టీ సభ్యుల తీర్మాణం మేరకే పనులు చేయడం జరిగిందని, నేను ఏనాడు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోలేదని అన్నారు. నాకు పదవులు అనుభవించాల్సిన అవసరం లేదని, నాకు పదవి ఉన్న లేకున్నా ప్రజల సంక్షేమమే ముఖ్యమని అన్నారు. సర్వ సభ్య సమావేశంలో కూడా అందరూ నాపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడారు అయిన కూడా నేను ఎలాంటి తప్పు చేయలేదని, ఆ మాటలన్నీ వాళ్ళ విజ్ఞతకే వదిలేసానని అన్నారు. ఆ సమావేశం లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఈ నిధుల విషయంలో ఎంక్వయిరీ జరుపాలని చెప్పిన కూడా ఆగకుండా నాపై అవిశ్వాసం పెట్టారని అన్నారు. నాపై ఎలాంటి ఎంక్వయిరీ చేసిన నేను సిద్దంగా ఉన్నానని, అన్ని రకాల రికార్డులు ముందు పెడతానని ఎంపీపీ అన్నారు. మండల పరిషత్ కి సంబంధించి వచ్చే 15 వ ఆర్థిక సంఘం నిధులు ఎంత కావాలి అనే విషయం కూడా మెజార్టీ సభ్యుల అభిప్రాయాలు మేరకే పంపించామని, దాని ఆధారంగానే ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేశారని అన్నారు. ఈ ఎంపీటీసీ లు గోరిగే నర్సింహా, దోమల సతీష్, వేమవరపు సుధీర్ బాబు, గాదె పారిజాత, కో ఆప్షన్ సభ్యులు ఎండీ.అమీర్, తదితరులు పాల్గొన్నారు.



# అయ్యప్ప ఇరుముడి మహోత్సవంలో పాల్గొన్న మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి



ఇబ్రహీంపట్నం, జనవరి 05 (తీన్మార్ న్యూస్): ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలం ముక్కునూరు గ్రామంలోని అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యువ నాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ముందుగా ఆ మణికంఠ అయ్యప్ప స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరికీ అయ్యప్ప స్వామి అనుగ్రహం ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోదూరి రమేష్, ఇబ్రహీంపట్నం మండల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంకాల కరుణాకర్, ముక్కునూరు గ్రామ అధ్యక్షుడు దొడ్డి కరుణాకర్, ఎమ్ ఆర్ ఆర్ ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధ్యక్షుడు చింతపట్ల కిరణ్, సల్మాన్ గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తధితరులు పాల్గొన్నారు.

# పొట్టిమరి వైన్స్ చోరీ నిందితుల రిమాండ్



రాజాపేట, జనవరి 05(తీన్మార్ న్యూస్): మండలంలోని రఘునాధపురం మధిర గ్రామం పొట్టిమర్రి వైన్స్ లో జరిగిన చోరీ నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసినట్లు ఏసీపి శివరాం రెడ్డి గురువారం రాత్రి మీడియాకు తెలిపారు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల మేరకు సిబ్బందితో మండలంలోని పాముకుంట చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై యాదగిరిగుట్ట నుండి అనుమానాస్పదంగా వస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఎలాంటి వాహన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో పాటు రూపాయలు నాలుగు లక్షల 4.45 వేల రూపాయలతో పాటు పది మద్యం సీసాలు లభించినట్లు తెలిపారు. వారిని పూర్తిగా విచారించగా కామారెడ్డి జిల్లాకు చెందిన ఎన్నోజూరు రవి, ఆంధ్రప్రదేశ్ కు చెందిన బైరప్పగాని హరీష్ గా గుర్తించారు. వీరు గతంలో జైలుకు వెళ్లి తిరిగి చోరీలకు పాల్పడుతున్నారని అంతేకాకుండా పొట్టి మరి వైన్స్ షాపు షట్టర్ పగలగొట్టి చోరీకి పాల్పడడంతో పాటు సదాశివ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైన్ షాప్ లో గతంలో కరీంనగర్ మెదక్ హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. ఈ విషయంపై వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోయాదగిరిగుట్ట రూలర్ సిఐ సురేందర్ రెడ్డి, రాజాపేట ఎస్సై సుధాకర్ రెడ్డి, రాజపేట పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ యాదయ్య, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు

భువనగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 05(తీన్మార్ న్యూస్): భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లాస్థాయి డిక్లమేషన్ (వకృత్వ) పోటీలు తేదీ 09 జనవరి 2024 నాడు సిఎస్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భువనగిరి నందు ఉదయం 10:00 గంటలకు నిర్వహిస్తున్నట్టు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి ప్రవీణ్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మై భారత్ - వికసిత భారత్ఏ2047 అనే అంశంపై జిల్లా స్థాయి డిక్లమేషన్ (వకృత్వ) పోటీ ఉంటుంది 15 నుండి 29 సంవత్సరల వయసు కలిగి ఉండాలి కేవలం 7 నిమిషాల మై భారత్ - వికసిత భారత్ఏ2047 అనే అంశం మీద ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషలో ప్రసంగించాలని తెలియజేశారు. జిల్లాస్థాయిలో పోటీల్లో గెలిచిన యువతకు ప్రశంస పత్రం మెమొంటో అందించబడును. రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుంది రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి రూ.100000/- రెండవ బహుమతి. రూ.50000/- మూడవ బహుమతి. రూ.25000/- ఇద్దరికీ అందించడం జరుగుతుందనీ ఈ పోటీలకు పాల్గొనదల్చిన యువత తేదీ: 08 జనవరి 2024 సాయంత్రం 5 గంటలలోపు 9052798602 సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరారు.

# ప్రజా పాలన సద్వినియోగం చేసుకోవాలి




## - ఎంపీడీవో జ్ఞాన ప్రకాష్ రావు

ఆలేరు, జనవరి 05(తీన్మార్ న్యూస్): ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జ్ఞాన ప్రకాష్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని మంతపురి, శర్బనాపురం గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ సలీం, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణ, మహేందర్, మల్లేష్, తిరుమల చారి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య క్యాలెండర్ ఆవిష్కరణ



ఆలేరు, జనవరి 05(తీన్మార్ న్యూస్): నూతన సంవత్సరం సందర్భంగా ప్రభుత్వ విప్ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆవిష్కరించిన క్యాలెండర్ ను శుక్రవారం మండలంలోని కొల్లూరు గ్రామంలో కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు జనగాం శ్రీపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్ శంకరయ్య, వార్డు సభ్యులు కొంతం వెంకటేష్, మహేందర్, తదితరులు ఉన్నారు.

# అర్హులందరు దరఖాస్తు చేసుకోవాలి







## - సర్పంచ్ గుంటి మధుసూదన్ రెడ్డి

రాజాపేట, జనవరి 05(తీన్మార్ న్యూస్): అర్హులైన ప్రతి ఒక్కరు 6 గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని రాజాపేట మండల జాల గ్రామ సర్పంచ్ గుంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో ప్రజా పాలనలో దరఖాస్తుల స్వీకరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఎంపిఓ దినకర్, మాధవి, గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గంధమల నరసింహులు, మదర్ డైరీ డైరెక్టర్ గొల్లపల్లి రామ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉమేష్ యువకులు ముత్యం రెడ్డి, శ్రావణ్ కుమార్, కొల్లూరు రమేష్, మునిగంటి ఉమేష్, వార్డు సభ్యులు ముత్రాయి సింగ్, పరమేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మానుపాటి నరసింహులు, కొన్యాల మల్లారెడ్డి, నర్సిరెడ్డి, మునిగడ్డ వెంకటేష్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న ను కలిసిన సాయి కుమార్ గౌడ్



## - పలు రకాల అంశాలపై చర్చ

హైదరాబాద్, (తీన్మార్ న్యూస్): క్యూ న్యూస్ అధినేత తీన్మార్ మల్లన్న ను ప్రముఖ వ్యాపారవేత్త కూనూరు సాయి కుమార్ గౌడ్ శుక్రవారం మీడియా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాష్ట్రంలో ఉన్న రాజకీయ, పరిస్థితులు, పలు రకాల అంశాలపై చర్చించారు. సాయి కుమార్ గౌడ్ కి మల్లన్న కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేరటి స్వామి యాదవ్, రాపోలు శ్రీకాంత్, కడారి అభినేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ఏ జండగా పనిచేస్తాం

**- పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీని విస్తరించాలి**

నల్లగొండ జిల్లా ప్రతినిధి, జనవరి 05(తీన్మార్ న్యూస్): కమ్యూనిస్టులకు ఓట్లు సీట్లు ముఖ్యం కాదని ప్రజా సమస్యల పరిష్కారమే ఏజండగా ముందుకు వెళ్లాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఎండి సలీం పిలుపునిచ్చారు. గురువారం రాత్రి నల్లగొండ పట్టణంలోని 11వ వార్డు కతాలగుడెంలో సిపిఎం 11వ వార్డు శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ తెలంగాణలో నియంత పాలన అంతరించి ప్రజా పాలన ప్రారంభం కావడం అభినందనీయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలలో ఐదు అమలు చేయడానికి తీసుకుంటున్న దరఖాస్తులు విచారణల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే అర్హులందరికీ అమలు జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి పొందుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఆధార్ కార్డు ప్రాతిపదికన నగదు చెల్లింపు వ్యవస్థ తీసుకురావడం ద్వారా ఉపాధి కూలీలు పనికి అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకాన్ని మరింత బలోపేతం చేస్తూ పట్టణ ప్రాంతాలకు విస్తరింపజేసి పట్టణ పేదలకు ఉపాధి కల్పించాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో 552 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు డ్రా ద్వారా ఎంపిక చేసి అర్హులను గుర్తించారని వారికి వెంటనే



డబుల్ బెడ్ రూమ్ ఇల్లు స్వాధీనపరచాలని విజ్ఞప్తి చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దగ్గర మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని, కతాల గూడెం లోని స్మశానవాటిక లో మౌలిక వసతులు కల్పించి, రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. సాగర్ రోడ్ నుండి కొత్తపెల్లి కాల్వ వరకు నాలుగో వరుసల రోడ్లు, సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, కతాల గూడెం నుండి మామిల్లగూడెం మీదుగా గుండ్లపల్లి ఎక్స్ రోడ్ వరకు రెండు వరుసల తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాలనీలలో అంతర్గత సిసి రోడ్లు నిర్మాణం చేసి డ్రైనేజీ నిర్మించకపోవడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని ఆరోపించారు. వార్డు విస్తీర్ణానికి అనుగుణంగా మున్సిపల్ కార్మికుల సంఖ్య పెంచాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యురాలు దండెంపల్లి సరోజ, 11వ వార్డు శాఖ కార్యదర్శి పనస చంద్రయ్య,శాఖ సభ్యులు దండెంపల్లి మారయ్య, యాదయ్య, పల్లె నగేష్, కృష్ణ, చంద్రబాబు, జానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# అందరూ అభయ హస్తం ను వినియోగించుకోవాలి





భువనగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 05(తీన్మార్ న్యూస్): స్థానిక 8వ వార్డ్ లో జరుగుచున్న అనేక అభివృద్ధి కార్యక్రమంలో బాగంగా అభయ హస్తం పథకం కూడా తీసుకురావటం జరిగిందనీ, దీనిని కూడా సద్వినియోగం చేసుకోవాలని 8వ వార్డ్ కౌన్సిలర్ పంగరెక్క స్వామి పిలుపునిచ్చారు. రేపటి తో గడువు ముగియనున్న ఈ పథకం లో అందరూ ధరకాస్తు చేసుకొని లబ్ధి పొందాలని స్లం ఏరియా అయిన మన ప్రాంతంలో ఎక్కువగా పేదలు నివసించే ప్రాంతం అయినందున ప్రతి ఒక్కరూ ఇట్టి పథకం లో భాగస్వాములు అవ్వాలి అని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కో. ఆప్షన్ సబిత గోపాల్, శాఫియొద్దిన్, లక్ష్మి ధనలక్ష్మి లు పాల్గొని అభయ హస్తం ధరకాస్తు లు స్వీకరించారు.

# వెల్లంకి గ్రామంలో జిల్లా స్థాయి టోర్నమెంట్ ప్రారంభం

**- ప్రారంభించిన సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి, ఎస్ఐ లక్ష్మయ్య**

రామన్నపేట, జనవరి 05(తీన్మార్ న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, వెల్లంకి గ్రామంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను గ్రామ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి, మరియు రామన్నపేట సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మయ్య ల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్రీడలు





మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని కలగ చేస్తాయని, గ్రామంలోని యువకులంతా ఉత్సాహంగా పాల్గొని ఈ యొక్క క్రీడోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆవనగంటి నాగేష్, ఎడ్ల నరేందర్ రెడ్డి, ఆయిటిపాముల పెద్దులు, కనతాల శశిధర్ రెడ్డి, ఎర్రోళ్ల నరసింహ, తాటిపాముల కిరణ్, గంజి భాస్కర్, ఆవనగంటి ప్రవీణ్, మధు మరియు క్రీడాకారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# మీరు బియ్యం కొంటున్నారా కొంటె మోసపోయినట్లే

**- 25 కిలోలకు బదులుగా 24 కిలోలు...**
**- 25 కిలోల సంచికి 40 రూపాయలు మోస పోతున్న వైనం**
**- ఎమ్మార్పీ కంటే అధికంగా వసూళ్లు**
**- పర్యవేక్షణ లోపంతో ఇష్టం వచ్చినట్లుగా అమ్మకాలు...**
**- మితిమీరుతున్న రైస్ మిల్, బియ్యం షాపుల యజమానులు**




రాజన్న సిరిసిల్లా ప్రతినిధి, జనవరి 05(తీన్మార్ న్యూస్): రాజన్న సిరిసిల్లా జిల్లా కేంద్రంలో ఉన్న బియ్యం షాపులలో సన్న బియ్యం (జై శ్రీరామ్ సన్నరకం) నికర బరువు 25 కిలోలు అని ప్రింట్ చేసి వినియోగదారులను మోసాగి స్తున్నా వైనం వివరాలలోకి వెళ్తే సిరిసిల్లా లోని మార్కెట్ ఏరియాలో ఉన్న బియ్యం దుకాణాలలో 25 కిలోల బియ్యనికి బదులుగా 24.430 సంచీ (బరువుతో సహా)గా వస్తుంది సంచి బరువుతో కలుపుకొని 25 కిలోలు కూడా రాకపోవడంతో ఒక సంచికి (700 గ్రాములకు 40 రూపాయలమేర నష్టపోవడమే) మంచిరకం అని చెప్పి క్వింటాలుకు 7200/- కి అమ్ముతూ 200రూపాయలకు పైగా




రూపాయలమేర వినియోగదారుల జేబుకు చిల్లుపెడుతున్నారు. అయితే 25 కిలోల బియ్యం సంచిమీద 1599 రూపాయలు మాత్రమే ఉన్న కూడా 1800 రూపాయల అధిక ధరకు అమ్ముతున్నారు. వినియోగదారులకు మోసపురితంగా తూకం వేసి అమ్ముతే ఐపీసీ సెక్షన్264 నుండి 267 ప్రకారం ఒక సంవత్సరాకాలం జైలు శిక్షా మరియు జరిమానా వెయ్యలని ఉన్నకుడా చట్టాన్ని అమలు చేయడంలో విఫలం అవుతూ, వేడుక చూస్తున్నా తూనికల కొలతల అధికారులు తక్కువ తూకం వేసినందుకు గాను కఠినచర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

# జాయ్ స్మైల్స్ ఫౌండేషన్ అంచెలంచెలుగా ఎదగాలి

**- చారిటబుల్ ట్రస్టు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జారె**
**- ఎప్పటికీ తన సహకారం ఉంటుందని హామీ**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రతినిధి, జనవరి 05(తీన్మార్ న్యూస్): జిల్లాలోని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామానికి చెందిన పాస్టర్ కుంజ రామకృష్ణ దంపతులు వారి కుమార్తె జాయ్ జ్ఞాపకార్థం ఒక చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసుకున్నారు. ఈ ట్రస్టు ప్రారంభోత్సవం చేయాలని పాస్టర్ కుంజ రామకృష్ణ దంపతులు ఎమ్మెల్యే జారె ఆదినారాయణను ఆహ్వానించడానికి వెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే జారె వెంటనే పదివేల రూపాయలు అందించారు. ఈరోజు ట్రస్టు ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే పాస్టర్ కుంజ రామకృష్ణ దంపతులకు అభినందనలు తెలియజేశారు. తమ కుమార్తె తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయినా ఆ బాధను దిగమింగుకుని సమాజానికి తమ వంతు సేవ చేయడానికి ట్రస్టును ఏర్పాటు చేసుకోవడం చాలా ఆనందం కలిగించిందని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యే కాక మునుపే రామకృష్ణ దంపతులను కలిశానని జాయ్ మరణ వార్త విని వారిని పరామర్శించడానికి వెళ్ళినప్పుడు ట్రస్టు ప్రారంభించాలని వారితో చెప్పానని గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పోయిన సంవత్సరం తాను చెప్పిన మాట ఈ సంవత్సరం తాను ఎమ్మెల్యే అయిన తర్వాత నెరవేరడం మరింత ఆనందంగా ఉందని అన్నారు. జాయ్ స్మైల్స్ ఫౌండేషన్ భవిష్యత్తులో ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేపట్టాలని అంచెలంచెలుగా ఎదగాలని







ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తొమ్మిది పదవ తరగతుల పిల్లలకు పెన్నులు పరీక్ష పాడ్లు ఇంగ్లీష్ తెలుగు నిఘంటువులు స్పోకెన్ ఇంగ్లీష్ మరియు స్పోకెన్ హిందీ పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె క్రైస్తవ గీతాన్ని ఆలపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఎమ్మెల్యే రాగయుక్తంగా పాడుతుండగా అక్కడున్న పాస్టర్లు అందరూ ఏకీభవించడంతో ప్రారంభోత్సవం కార్యక్రమం కాస్తా భారీ బహిరంగ సభను తలపించింది. ఆద్యంతం ఉల్లాసభరితంగా సాగిన ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు స్థానిక సర్పంచ్, ఎంపిటిసి, సిడిపిఓ నిర్మల జ్యోతి, మరియు పాస్టర్లు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం అక్కడికక్కడే మృతి చెందిన వ్యక్తి

**- స్కూటీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు**

యాచారం, జనవరి 05(తీన్మార్ న్యూస్): స్కూటీని, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందిన సంఘటన యాచారం మండలంలోనీ హైదరాబాద్-నాగార్జున సాగర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. యాచారం మండలం మాల్ గ్రామపంచాయితీ రాఘవేంద్ర హోటల్ సమీపంలోని మైసమ్మ గుడి వద్ద హైదరాబాద్ - నాగార్జున సాగర్ జాతీయ రహదారిపై ఈ ఘటన జరిగింది. హైదరాబాద్ నుండీ దేవరకొండ వైపు వెళ్తున్న దేవరకొండ డిపో బస్సు డ్రైవరు అతివేగంగా అజాగ్రత్తగా మాల్ వైపు వెళుతున్న యాక్టివా స్కూటీని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో స్కూటీ పై ప్రయాణిస్తున్న నందివనపర్తి గ్రామానికి చెందిన నాగలపల్లి రామ్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి ఎస్సై వెంకట్ నారాయణ చేరుకొని పరిశీలించి, పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.










# ఆన్లైన్ నమోదు జాగ్రత్త గా చేయాలి

**- జిల్లా కలెక్టర్ జెడెంగే హనుమంతు కొడింబా సూచన**
**- ప్రారంభమైన శిక్షణా తరగతులు**

భువనగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 05(తీన్మార్ న్యూస్): ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల ఆన్లైన్ నమోదు ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు హనుమంతు కే.జెండగే డాటా ఎంట్రీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం నాడు కలెక్టరేటు సమావేశ మందిరంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్లైన్ నమోదు చేసేందుకు డేటా ఎంట్రీ సిబ్బందికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్స్ ద్వారా అభయ హస్తం క్రింద మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇండ్లు పథకాలపై ఆన్లైన్ నమోదు చేసే విధానంపై రిసోర్స్ పర్సన్స్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రజలు దరఖాస్తులో పేర్కొన్న ప్రకారం మాత్రమే వివరాలను ఆన్లైన్ నమోదు చేయాలని,







నమోదు అనంతరం ప్రివ్యూ చూశాక సబ్మిట్ చేయాలని, అనంతరం వచ్చిన నెంబరును సంబంధిత దరఖాస్తుపై తప్పనిసరిగా వ్రాయాలని సూచించారు. డాటా ఎంట్రీ చేసిన తరువాత మీకిచ్చిన దరఖాస్తులను తిరిగి జాగ్రత్తగా సంబంధిత సూపర్వైజర్లకు అందచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు జి.వీరారెడ్డి, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు ఏ.భాస్కరరావు, జిల్లా పంచాయితీ అధికారి సునంద, శిక్షణా రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.




## డాక్టర్.అద్దంకి దయాకర్ దంపతులకి పెళ్లి రోజు శుభాకాంక్షలు

- ప్రధాన అనుచరుడు పరిటాల రవి కుమార్ గౌడ్

హైదరాబాద్, (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మనసున్న మహారాజు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ముద్దుబిడ్డ డాక్టర్ అద్దంకి దయాకర్ పుణ్య దంపతులకు ప్రధాన అనుచరుడు పరిటాల రవి కుమార్ గౌడ్ పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ ఆ భగవంతుణ్ణి వేడుకుంటున్నా అని శుభాకాంక్షలు తెలిపారు.



అనుచరుడు పరిటాల రవి కుమార్ గౌడ్

# ఎమ్మెల్యే ఆదేశం.. వేళకు తెరుచుకోని సచివాలయం!

పెద్దపప్పూరు, : మండలంలోని ముచ్చుకోట గ్రామ సచివాలయ సిబ్బందిని మూకుమ్మడిగా తాడిపత్రిలోని తన కార్యాలయానికి రావాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశించడంతో గ్రామ సచివాలయం మధ్యాహ్నం 12. 10 గంటల వరకూ తెరుచుకోలేదు. 12.10 గంటలకు వాచ్‌మెన్ సచివాలయాన్ని తెరిచినా మధ్యాహ్నం 2 గంటల వరకూ సిబ్బంది హాజరు కాకపోవడంతో కుర్చీలు ఖాళీగానే కనిపించాయి. సచివాలయ సేవల కోసం వచ్చిన ముచ్చుకోట, వరదాయపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సచివాలయంలో ఒక్కరూ కూడా లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ నెల 11న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ముచ్చుకోటలో పర్యటించిన సందర్భంలో ప్రజలు వివిధ సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో సచివాలయ ఉద్యోగులెవరూ హాజరు కాలేదు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే తాడిపత్రిలోని తన కార్యాలయానికి మంగళవారం పిలిపించుకున్నారు. ఉదయం 10 గంటలకు సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యే కార్యాలయంలో హాజరైనా ఆయన అందుబాటులో లేకపోవడంతో మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఎదురు చూసి ఎమ్మెల్యే




రావడం ఆలస్యమవుతుందని కార్యాలయ సిబ్బంది తెలపడంతో వారు వెనుదిరిగి సచివాలయానికి చేరుకున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ రామకృష్ణను వివరణ కోరగా 'సచివాలయంలో ఒకరు ఉండాల్సింది. ఎమ్మెల్యే అందరూ రావాలని ఆదేశించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వచ్చింది. ఎమ్మెల్యే పిలిచినప్పుడు సిబ్బంది హాజరు కావడంలో తప్పేమీ లేదు' అని పేర్కొన్నారు.

# యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



రాయదుర్గం, న్యూస్‌టుడే : రాయదుర్గం నియోజకవర్గం నుంచి కర్ణాటకకు పెద్దఎత్తున అక్రమంగా ఇసుక తరలుతోంది. అధికార పార్టీ నాయకులు కొందరు రోజూ వందల వాహనాల్లో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గుమ్మఘట్ట మండలంలోని గుమ్మఘట్ట, రంగచేడు, భూపసముద్రం సమీపాల్లోని వేదావతి హగరిలో పగలంతా ఇసుక తవ్వి ఒక చోట నిల్వ చేసి.. రాత్రుళ్లు పక్కనే ఉన్న కర్ణాటకలోని కొండ్లపల్లి, మల్లసముద్రం, కోనసాగరం, గౌరసముద్రం ప్రాంతాలకు తీసుకెళ్లి ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.4,500 విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్లకు ఇసుక నింపటానికి మూడు బ్యాచ్‌లుగా హమాలీలను ఇక్కడ ఏర్పాటు చేసుకున్నారంటే తవ్వకాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో ఇట్టే అర్థమవుతోంది. భూపసముద్రం, రంగచేడు సమీపాన వేదావతి హగరిలో తవ్వకాలు జరిపి ట్రాక్టర్లలో రాయదుర్గం పట్టణానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అధికార పార్టీ వాళ్లం.. మమ్మల్ని అడిగేదెవరనే ధీమాతో అక్రమార్కులు వ్యవహరిస్తున్నారు. హగరి నుంచి ట్రాక్టర్ బయటికొచ్చి గుమ్మఘట్ట గ్రామం దాటాలంటే పోలీసు స్టేషన్, రెవెన్యూ కార్యాలయం మీదుగా వెళ్లాలి. ఆ కార్యాలయాల ముందే అక్రమంగా ఇసుక తరలిపోతున్నా అధికారులెవరూ పట్టించుకోవడంలేదు. ఇసుక వాహనాలను కర్ణాటక సరిహద్దు దాటించేందుకు రెవెన్యూ శాఖలోని కింది స్థాయి సిబ్బంది కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రోజూ వందకు పైగా ట్రాక్టర్లతో ఇసుకను తరలించి అనుకూలమైన చోట డంపింగ్ చేస్తున్నారు. రాత్రుళు గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటకకు రోజూ వందల ట్రాక్టర్లలో తరలిస్తూ.. జేబులు నింపుకొంటున్నారు. అధికారులకు వివరాలన్నీ తెలిసినా అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

# వ్యాధి నిర్ధారణ, నివారణే కీలకం


తిరుపతి: పశువులకు వచ్చే వ్యాధులను అదుపు చేయడం, వ్యాప్తిని నివారించడం ఎంతో ముఖ్యమని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి.భారతి అన్నారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశు వైద్య వర్సిటీ రాష్ట్రస్థాయి పశు వ్యాధి నిర్ధరణ ప్రయోగశాలలో ఆధ్వర్యంలో 'వ్యాధి నిర్ధరణ– వ్యాప్తి నివారణ సంబంధమైన అత్యాధునిక పద్ధతులు, సరళి' అనే అంశంపై చేపట్టిన మూడురోజుల జాతీయ సదస్సును ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మానవ వైద్యంతో సమానంగా పశు వైద్యం ఆధునికత సంతరించుకుందని, మూగజీవాల విషయంలో వ్యాధి నిర్ధరణ అనేక సవాళ్లతో కూడుకున్న అంశమన్నారు. పశువైద్య వర్సిటీ పరిశోధన సంచాలకులు డా.సర్జన్‌రావు మాట్లాడుతూ తిరుపతిలో అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులోకి తెచ్చిన రాష్ట్రస్థాయి పశు వ్యాధి నిర్ధరణ ప్రయోగశాల ద్వారా వ్యాధి నిర్ధరణ సులభమవుతుందని తెలిపారు. సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డా.రాణి ప్రమీల మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి వ్యాధి నిర్ధరణ కోసం నమూనాలు




అందుతున్నాయని, పలు జూనోటిక్ వ్యాధులు, ప్రాణాంతక వ్యాధుల నిర్ధరణ వేగంగా చేస్తున్నామన్నారు. సదస్సుకు 120 మందికి పైగా శాస్త్రవేత్తలు హాజరవుతున్నట్లు ఆమె వివరించారు. ఇన్‌ఛార్జి ఉపకులపతి గోపాలకృష్ణ ద్వివేది ముఖ్యఅతిథిగా, పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఆచార్య భారతి, సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి గౌరవ అతిథులుగా హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు. డీన్ డా.జగపతి రామయ్య, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## రైతులకు పరిహారం

# అందేలా కృషి : కేంద్ర కరవు బృందం



మడకశిర : తీవ్ర వర్షాభావంతో దెబ్బతిన్న పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించామని, పాడి పశువులకు గడ్డి, నీటి కొరత కూడా తీవ్రంగా ఉన్నట్లు గుర్తించామని, రైతుల ఆవేదనను చూశామని నివేదికను తయారు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన సాయం అందేలా కృషి చేస్తామని కేంద్ర కరవు బృందం సభ్యులు పి.దేవేంద్రరావు, కృష్ణ, ప్రదీప్‌కుమార్, అంజుబసేరా పేర్కొన్నారు. మండలంలోని బుళ్లసముద్రం వద్ద రైతు లక్ష్మీదేవమ్మ, హరేసముద్రం గ్రామం వద్ద రైతు వెంకోబప్ప సాగు చేసిన కంది, వేరుసెనగ పంటలను బుధవారం వారు పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కదిరేపల్లి రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన దెబ్బతిన్న పంట పొలాల ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి ఎంత మంది రైతులకు సంబంధించి ఎన్ని ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయనే వివరాలను వ్యవసాయాధికారులతో తెలుసుకుని నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, సబ్ కలెక్టర్ కార్తిక్, జిల్లా వ్యవసాయాధికారి వై.వి. సుబ్బారావు, జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్, సూక్ష్మ నీటిపారుదల శాఖ పీడీ సుదర్శన్, పశుసంవర్ధక శాఖ డీడీ పెంచలయ్య, ఏడీ అమర్, వ్యవసాయ శాఖ ఏడీఏ కృష్ణమీనన్, ఏఓ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు. భాజపా నాయకులు చంద్రశేఖర్, రైతు సంఘం నాయకులు సోమకుమార్, వేమారెడ్డి, రామచంద్రప్ప, శ్రీరామప్ప తదితరులు కేంద్ర బృందాన్ని కలిసి వినతి పత్రాలు అందజేశారు. వేరుసెనగ పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ఫైనాన్స్ ప్రకారం రూ.40 వేలు, ఉద్యాన పంటలకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. నీరు లేక ఎండిన దానిమ్మ, వక్క తదితర తోటకు ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో పరిహారం అందించేందుకు చేస్తున్న ఈ–పంట నమోదు లోపభూయిష్టంగా ఉందని, పంట సాగు చేసి నష్టపోయిన ప్రతి రైతు వివరాలు సేకరించాలని కోరుతూ తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నాయకులు కరవు బృందం అధికారులకు వినతిపత్రం అందజేశారు. బుధవారం మడకశిర నియోజకవర్గంలో కేంద్ర కరవు బృందం సభ్యులు పంటలను పరిశీలించారు. బృందాన్ని కలిసిన తెదేపా నాయకులు నియోజకవర్గ పరిస్థితిని వివరించారు. 5 మండలాల పరిధిలో 70శాతం బీడు భూములుగా మారాయని, దాదాపు 25 వేల మంది ఉపాధి కోసం బెంగళూరుకు వలస వెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు మనోహర్, డాక్టర్ కృష్ణమూర్తి, భక్తర్, పుల్లయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

# 'మేకల, గొర్రెల పెంపకందారులను ఆదుకోవాలి'

డోన్ : మాంసం ఉత్పత్తుల్లో కీలకంగా ఉండి సమాజానికి పౌష్టికాహారం అందిస్తూ రాష్ట్రానికి లాభాలు తెచ్చి పెడుతున్న గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలని చేతివృత్తుల సమాఖ్య జాతీయ నాయకుడు, అఖిల భారత మత్స్య కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. పట్టణంలోని కొత్తబస్టాండు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో జీవాల సంరక్షణ–జీవనోపాధి సమస్యలపై ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల, మేకల పెంపకందారుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. గొర్రెలు, మేకలకు సీజనల్ వ్యాధులు వస్తే వాటిని పట్టించుకోవడానికి




సరైన వెటర్నరీ అధికారులు కూడా పూర్తి స్థాయిలో లేరని ?అన్నారు. గ్రామాల్లో ప్రత్యేకంగా గొర్రెలు, మేకలను మేపుకునేందుకు పచ్చిక బైళ్లను ప్రభుత్వం కేటాయించాలన్నారు.

## ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు..

# దరఖాస్తుదారులకు తిప్పలు




అనంతపురం:సర్వజన వైద్యశాలలో జనన, మరణ ధ్రువపత్రాల జారీ ఓ ప్రహసనంగా మారింది. పత్రాల జారీలో ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా వాటిల్లో తప్పులు వస్తున్నాయి. ఇందుకు ఉద్యోగులు కారణమైతే.. దరఖాస్తుదారులకు ప్రయాసలు వస్తున్నాయి. సరిదిద్దేందుకు వెళ్తే ఛీత్కారాలు వస్తున్నాయి. వెరసి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ విసుగెత్తిపోతున్నారు. దరఖాస్తుదారుల పేర్లు, వారి వివరాల నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తమ తప్పు లేకపోయినా ఎంఆర్‌వో, వీఆర్‌వో, గెజిటెడ్ అధికారుల వద్దకు పత్రాలను తీసుకెళ్లి సంతకాలు పెట్టాలని విన్నవించుకుంటు న్నారు. సదరు అధికారులు తామెందుకు సంతకాలు చేస్తామని మీరే వెళ్లి ఆసుపత్రి అధికారులను కలవండని చెబుతుండటంతో దరఖాస్తుదారులు విసుగెత్తిపోతున్నారు. ధ్రువీకరణ పత్రాల జారీ విభాగానికి సంబంధించి ఏడాది నుంచి ఇన్‌ఛార్జిగా స్టాటికల్ అధికారి వ్యవహరిస్తున్నారు. నెల రోజులుగా ఆ అధికారి సెలవుపై వెళ్లారు. మరో అధికారికి బాధ్యతలు అప్పగించకపోవటంతో అతను అంతా తానై ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడు. ఇన్‌ఛార్జినంటూ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజువారీగా రమారమి జనన 60, మరణ 60 ధ్రువీకరణ పత్రాలు జారీ అవుతున్నాయి. వీటిని ఏ రోజుకు ఆ రోజు ఇవ్వాలంటే కొంతమంది ఉద్యోగులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని దరఖాస్తుదారులు వెల్లడిస్తున్నారు. జారీ చేస్తున్న జనన, మరణ ధ్రువీకరణ పత్రాల్లో 70 శాతం మేర తప్పులు దొర్లుతున్నాయి. వీటిని దిద్దుకునేందుకు రోజుకు 20కి పైగా ఆసుపత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు అంచనా. దరఖాస్తుదారుల ఆధార్, రేషన్ కార్డులో వివరాలను పరిశీలించకుండానే పత్రాలను జారీ చేస్తుండటంతో పరిస్థితి తలెత్తుతోంది. దరఖాస్తుదారులు ఉరుకు పరుగులతో వచ్చి ఉసూరంటున్నారు. ఆధార్‌లో పేర్కొన్న విధంగానే కేస్ షీట్‌లో లబ్ధిదారు వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతూ చనిపోయిన వారికి మరణ ధ్రువీకరణ పత్రాన్ని పొందేందుకు దరఖాస్తు చేసుకుంటారు. వీటిల్లో కూడా తప్పులే వస్తున్నాయి. దీంతో మరోసారి ఆసుపత్రికి వచ్చి ఉద్యోగులతో వాగ్వాదానికి దిగుతున్నారు.

# పునాదులకే పరిమితమైన ఇళ్లు

# కాలనీల్లో కనిపించని మౌలిక వసతులు

పుట్టపర్తి :'జగన్ అన్నయ్యా.. సొంతిటి కల సాకారం చేస్తానంటివి.. నీవు ఇచ్చే రూ.1.80 లక్షలు ఏ మూలకూ సరిపడటం లేదు. అప్పులు చేసి చిన్నపాటి ఇల్లు నిర్మించుకున్నాక వెళ్లాలంటే కాలనీలో కనీస సౌకర్యాలు లేవు. ఎలా కాపురం చేయాలి' అని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇళ్లు నిర్మించుకున్నా.. అద్దె ఇంట్లోనే జీవించాల్సిన దుస్థితి వచ్చిందని వాపోతున్నారు. శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా 301 జగనన్నకాలనీలు ఉండగా.. ఎక్కడా పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలుకల్పించిన దాఖలాలు లేవు. కాలనీల్లో 31,944 గృహాలు మంజూరు కాగా, కేవలం 4,434 మాత్రమే అష్టకష్టాలు పడి పూర్తి చేసుకున్నారు. ఏ కాలనీలో చూసినా అర్థాంతరంగా ఆగిపోయిన పునాదులే దర్శనం ఇస్తున్నాయి. ప్రభుత్వానివి ఆర్భాటపు ప్రకటనలే తప్ప కనీస వసతులు కల్పించాలనే ధ్యాస లేదు. ధర్మవరం పట్టణంలో కుణుతూరు కాలనీ పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఈ లేఅవుట్‌లో మొత్తం 1,893 పట్టాలు ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి ఏమాత్రం అనువైన చోటే కాదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఎటుచూసినా పునాదులే కనిపిస్తాయి. కనీసం 10శాతం కూడా ఇక్కడ%రి% ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. పునాదులు నిర్మించి వదిలేయడంతో కంప చెట్లు ఎక్కువైపోతున్నాయి. ట్యాంకు రూ.600 ఇచ్చి కొనుగోలు చేయాల్సిందే. సరైన రోడ్డు లేకపోవడంతో వాహనాలు రావాలన్నా తీవ్ర ఇబ్బందులకు గురి కాక తప్పడం లేదు. విద్యుత్తు స్తంభాలు పెట్టినా కరెంటు మాత్రం లేదు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు పునాది, గోడలు వేయడానికే సరిపోతుంది. మరి ఓ ఇల్లు నిర్మించాలంటే అదనంగా రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షలు ఖర్చు చేయాల్సిందే. నిర్మించుకోకపోతే ఎక్కడ



స్థలం పోతుందోనని బంగారం తాకట్టు పెట్టి, వడ్డీకి అప్పులు తెచ్చి పనులు చేపడుతున్నారు. నిర్మాణానికి అవసరమైన నీరు కూడా కొనుక్కోవాల్సిన దుస్థితి. నిర్మాణ సామగ్రి ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. ఇలా అన్నీ కలిసి లబ్ధిదారులకు సొంత ఇంటి నిర్మాణం పెను సవాలుగా మారింది. అసలే కాలనీలు చాలా చోట్ల ఊరికి దూరంగా ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎంతో సతమతమవుతున్న ప్రజలు కష్టపడి పూర్తి చేసుకున్నప్పటికీ అధికారులు ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదు. రహదారులు, నీరు, విద్యుత్తు, డ్రైనేజీ ఇలా ఏ ఒక్కటీ కల్పించిన పాపనపోలేదు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యుత్తు, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ అధికారులకు నివేదికలు ఇవ్వడం జరిగింది. తాగునీరు, విద్యుత్తు సౌకర్యం కల్పిస్తున్నాం. రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నాం.

# పది పరీక్షల నిర్వహణలో నిధుల గోల్‌మాల్




కర్నూలు : పదో తర గతి పరీక్ష పత్రాల మూల్యాంకనానికి ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రెమ్యునరేషన్ నిధులను విద్యాశాఖ అధికారులు కాజేశారు. రెమ్యునరేషన్ కోసం ఉపాధ్యాయులు 9 నెలల నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారులకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 11న కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదు. అయితే విద్యాశాఖ అధికారులు మాత్రం ఉపాధ్యాయులందరికీ రెమ్యునరేషన్ జమ చేశామని బుకాయిస్తున్నారు. మే, జూన్ నెలలో జరిగిన పదో తరగతి పరీక్షలకు, సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు రూ.70 లక్షలు జిల్లా విద్యాశాఖ ఖాతాలో జమ అయ్యాయి. ఈ నిధులను పరీక్షల నిర్వహణలో, స్పాట్ వాల్యుయేషన్‌లో ఉపాధ్యాయుల ట్రాన్స్‌పోర్టు, స్టేషనరీ వంటి ఖర్చులకు వాడుకోవాలి. ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్‌ను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి. అయితే ఉపాధ్యాయులకు రావాల్సిన రెమ్యునరేషన్‌లో సగం మాత్రమే బ్యాంకు ఖాతాలో జమ చేసి మిగతా మొత్తాన్ని నొక్కేశారన్న ఆరోపణలున్నాయి. మరికొందరికి సగం కూడా రెమ్యునరేషన్ అందలేదు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదని ఉపాధ్యాయులు అంటున్నారు. విద్యాశాఖ అధికారులు ఒకరిపైన ఒకరు చెప్పుకుంటూ తప్పించుకుని తిరుగుతున్నారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో భారీ ఎత్తున నిధుల గోల్‌మాల్ జరిగిందని వారు అంటున్నారు. దీనిపై కలెక్టర్ విచారణ కమిటీని వేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నారు. మే, జూన్ నెలలో జరిగిన పదో తరగతి పరీక్షల రెమ్యునరేషన్ రూ.4వేలు ఇప్పటికీ ఇవ్వలేదు. ఆఫీసు చుట్టూ తిరిగి వేసారి పోయాను. అధికారులు స్పందించడం లేదు. మే, జూన్ నెలల్లో పదో తరగతి పరీక్షల స్పాట్ జరిగింది. రెమ్యునరేషన్ రూ.2వేలు మాత్రమే ఇచ్చారు. సప్లిమెంటరీ పరీక్షలకు రూ.3వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.1,200 మాత్రమే ఇచ్చారు. పది స్పాట్ నిధులు దుర్వినియోగం చేసిన డీఈవోను సస్పెండ్ చేయాలి. పది పరీక్షలు ముగిసి 8 నెలలు కావస్తుంది. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రెమ్యునరేషన్ చెల్లించలేదు. విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు కొందరికి సగం మాత్రమే ఇచ్చారు. మరి కొందరికి అసలు ఇవ్వలేదు.

# మహాశక్తి మేనిఫెస్టోతో మహిళలకు వరం

ఓర్వకల్లు, : టీడీపీ ప్రకటించిన మహాశక్తి మేనిఫె స్టోతో మహిళలకు వరం లాంటిదని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మండలంలోని కొమరోలు గ్రామంలో మహిళలకు భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి పథకంలో భాగంగా ఇంటిం టికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా గౌరు చరిత మా ట్లాడుతూ మహిళలకు టీడీపీ అధికారంలోకి వస్తే ఎన్నో ప్రయోజనాలు ఉం టాయన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, అత్యాచారాలు, అత్యచారాలు మితిమీరి పోతున్నా సీఎం జగన్ పట్టించుకోక పోవడం సిగ్గు చేటన్నారు. ముఖ్య మంత్రిగా చంద్రబాబు అయితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిం దరెడ్డి, టీడీపీజిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి,బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, భాస్కర్ రెడ్డి, రామాంజినేయులు, నాగమల్లేష్, రామమద్దిలేటి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కోడుమూరు(రూరల్): దుర్మార్గ వైసీపీ ప్రభుత్వానికి అంతిమ రోజులు నడుస్తున్నాయని టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ అన్నారు. సోమవారం వర్కూరులో బాబు ష్యూరిటీ భవిష్యతుకు గ్యారంటీ బాండ్లను అందించారు.



ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి వస్తే మ్యానిఫెస్టోలోని అన్ని పథకాలను అందిస్తామన్నారు. గూడూరు: సీఎం జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. సోమవారం గూడూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెం టీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి బాబు ష్యూరిటీ – భవిష్యత్ గ్యారెంటీ పత్రాలను అందించారు.

# రంగుమారిన ధాన్యం.. రైతు దైన్యం



బాపట్ల :తుపాను వెళ్లి వారం గడిచినా పొలాల్లో ఇంకా వరి ఓదెలు, నేల వాలిన పైరు నీటిలోనే నానుతున్నాయి. వరి కంకులకు మొలకలు వస్తు న్నాయి. ధాన్యం తడిసి రంగుమారింది. రంగుమారిన ధాన్యాన్ని ఎప్పుడు కొనుగోలు చేస్తారా అని రైతులు ఎదురుచూస్తున్నారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సీఎం వైఎస్ జగన్ ప్రకటించినా పౌరసరఫరాల శాఖకు ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత, ఆదేశాలు రాలేదు. ధాన్యం సేకరణలో ప్రభుత్వం నిబంధనలు సడలించి కొనుగోలు చేయకుంటే అన్నదాతలు తీవ్రంగా నష్టపోతారు. డెల్టాలో తుపాను వల్ల వరి రైతులు ఎక్కువగా నష్టపోయారు. జిల్లాలో 1.88 లక్షల ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. పొలాల్లో నుంచి ఇంకా నీరు పోలేదు. వారం రోజులుగా కోత కోసిన వరి ఓదెలు, నేలవాలిన పంట నీటిలోనే నానుతోంది. కంకులకు మొలకలు వస్తున్నాయి. ధాన్యం పూర్తిగా తడిసి రంగు మారుతోంది. రైతులు యంత్రాల ద్వారా తుపానుకు నేలవాలిన పంటను యంత్రాలతో నూరుస్తున్నారు. నూర్పిడి అదనంగా రూ.3 నుంచి 4 వేలు ఖర్చవుతోంది. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కర్లపాలెం, పిట్టలవానిపాలెం, చెరుకుపల్లి, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లో 216 ఏ జాతీయ రహదారిపై, వెల్లటూరు, కొల్లూరు, వేమూరు, జంపని రోడ్డుపై ఆరబెడుతున్నారు. చుండూరు, అమృతలూరు, నగరం, బాపట్ల మండలాల్లో ఇదే పరిస్థితి. భారీ వర్షాలకు తడిసి రంగుమారిన ధాన్యం వేల టన్నులు ఉంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2017-18లో తుపాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు ధాన్యం రంగు మారింది. రంగు మారిన ధాన్యాన్ని కొంత ధర తగ్గించి ప్రభుత్వమే కొనుగోలు చేసిం ది. ప్రస్తుతం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు విషయంలో ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. 2020, 2021, 2022 సీజన్లలో భారీ వర్షాలకు రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. మిల్లర్లను కొనుగోలు చేయాలని ఒత్తిడి తెచ్చింది. రైతులు చాలా తక్కువ ధరకు విక్రయించి నష్టపోయారు.రంగు మారకుండా బాగున్న ధాన్యాన్ని వ్యాపారులు బీపీటీ రకానికి 76 కేజీల బస్తాకు రూ.1700 నుంచి రూ.1720 రైతులకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. తడిసి రంగు మారిన ధాన్యాన్ని మాత్రం ఎవరూ కొనుగోలు చేయటం లేదు. జిల్లాలో పౌరసరఫరాల శాఖ 14 టన్నుల ధాన్యాన్ని మాత్రమే ఇప్పటి వరకు సేకరించారు. రైతులకు రూ.3 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. ఆర్బీకేల ద్వారా బాగున్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తున్నారు.

# అన్నదాతలను కేంద్రం ఆదుకుంటుంది

## - పరిశీలించిన కేంద్ర బృందం

బాపట్ల :మిగ్‌జాం తుపానుతో పంట నష్టపోయిన రైతులను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా ఆదుకుంటుందని కేంద్ర వ్యవసాయ శాఖ సం యుక్త సంచాలకుడు డి.విక్రాంత్‌సింగ్ అన్నారు. తుపాను పంట నష్టం అంచనాలను పరిశీలించడానికి ఆయనతో పాటు విద్యుత్ శాఖ సహాయ సంచాలకురాలు మీనా హుడా జిల్లాలోని అమృతమూరు మండలం ఇంటూరు, గోవాడలో పర్యటించారు. నీటి మునిగిన వరి పంట, మొలకెత్తిన వరి ఓదెలను బృందం స్వయంగా పరిశీలించింది. చేతి కందివచ్చిన పంట నీట మునిగిందంటూ కేంద్ర బృందం ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు కాలువలు అధ్వానంగా ఉ ండి ఆక్రమణలకు గురయ్యాయని, కట్టలు బలహీనంగా ఉండి గండ్లు పడటం వల్ల పంట నష్టం తీవ్రంగా ఉందని వివరించి వాపోయారు. ఎనిమిది రోజులుగా పంటలు నీటిలోనే నానుతూ కుళ్లిపోతున్నాయని వివరించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడిన కేంద్ర బృంద సభ్యులు జరిగిన పంట నష్టాన్ని తెలుసుకున్నారు. గోవాడ సచివాలయంలో పంట నష్టంపై అధికారులు ఏర్పాటు చేసిన ఛాయాచిత్రాల ప్రదర్శనను తిలకించారు. దెబ్బతిన్న వివిధ రకాల పంటల నమూనాలను పరిశీలిం చారు. జిల్లాలో మిగ్‌జాం తుపాను వల్ల జరిగిన నష్టంపై ప్రాథమికంగా రూపొందించిన అంచనాల నివేదికను కేంద్ర బృంద సభ్యులకు జేసీ శ్రీధర్ అందజేశారు. జేసీ మాట్లాడుతూ తుపాను వల్ల 24 గంటల వ్యవధిలో 20 సెం.మీ. వర్షపాతం నమోదైందన్నారు. జిల్లాలో 93,244



హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు చెప్పారు. 75,411 హెక్టార్లలో వరి, 363 హెక్టార్లలో వేరుసెనగ, 9,232 హెక్టార్లలో పొగాకు, 238 హెక్టార్లలో జొన్న, 3,530 హెక్టార్లలో మొక్కజొన్న, 738 హెక్టార్లలో కంది, 1129 హెక్టార్లలో పత్తి, 2,034 హెక్టార్లలో మినుము, 50 హెక్టార్లలో చెరకు, 446 హెక్టార్లలో జనపనార, 73 హెక్టార్లలో పెసర పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. 74 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 1388 మంది తుపాను బాధితులకు ఆశ్రయం కల్పించామన్నారు. తుపానుకు 11 వేల కుటుంబాలు నష్టపోయాయని, 132 గృహాలు, 65 రోడ్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులకు రూ.15 కోట్ల జరిగిందని, 400 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని, 40 కల్వర్టులు, వంద పడవలు దెబ్బతిన్నాయని వివరించారు. రైతులకు మేలు చేయాలని కోరారు.

# రబీ వరినాట్లకు అష్టకష్టాలు




కాకినాడ :ఖరీఫ్ పంటలకు తీవ్ర నష్టం కలిగించిన మిగ్‌జాం తుపాను రబీ సాగుపైనా ప్రభావం చూపింది. ఎక్కడికక్కడ నారుమడులు మునిగిపోయాయి. ఖరీఫ్ ధాన్యాన్ని కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్న రైతులు రబీ సాగుకు సన్నద్ధం కాలేపోతున్నారు. ఈ నెలాఖరుకు రబీ నాట్లు పూర్తి చేసి వచ్చే ఏప్రిల్ 7 నాటికి పంట కాలం పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. మూడో పంటకు ఆస్కారం ఉండేలా సకాలంలో రబీనాట్లు పూర్తి చేయాలని సూచిస్తున్నారు. దీనిలో భాగంగా వెదజల్లే విధానంలోనే నాట్లు వేయాలని నిర్ణయించారు. పంట పొలాల్లోకి నీరు చేరిన నేపథ్యంలో సులభతరంగా దమ్ములు చేసి వెదజల్లే విధానంలో విత్తనాలు వేయాలని చెబుతున్నారు. కాకినాడ జిల్లాలో గోదావరి, ఏలేరు ఆయకట్టు కింద 1.50 లక్షల ఎకరాల్లో రబీ వరిసాగుకు నిర్ణయించారు. ఇప్పటికి కేవలం 292 ఎకరాల్లో నాట్లు, 693 ఎకరాల్లో వెదజల్లే విధానంలో విత్తనాలు, 32 ఎకరాల్లో డ్రమ్ సీడింగ్ పూర్తయింది. 99 శాతం మేర నాట్లు వేయాల్సి ఉంది. సమయం లేకపోవడంతో వెదజల్లే విధానాన్ని పాటించాలని రైతులను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 9వేల ఎకరాల్లో నారుమడులు వేశారు. ఇవి 18వేల ఎకరాల్లో నాట్లు వేసేందుకు సరిపోతాయి. ప్రస్తుతం 20వేల ఎకరాల్లో దమ్ములు పూర్తయ్యాయి. ఇక్కడ వెదజల్లే విధానంలో నాట్లు వేయనున్నారు. ఈ నెలాఖరు నాటికి నాట్లు పూర్తి చేసి మార్చి 31 నాటికి కోతలు పూర్తి చేయాలని లక్ష్యంగా చేసుకున్నారు. ఏప్రిల్ 7లోగా ఎట్టి పరిస్థితుల్లోనూ రబీ పంట కాలం పూర్తి చేయాలని యోచిస్తున్నారు. అన్నవరం వద్ద ఉన్న పంపా రిజర్వాయర్‌లోకి వర్షాలతో నీరు చేరింది. అదనపు జలాలను కిందికి వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీని ఆయకట్టు కింద 6వేల ఎకరాల్లో రబీ వరిసాగుకు నీళ్లివ్వాలని నిర్ణయించారు. బుధవారం కాకినాడలోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్, జలవనరుల శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. 6వేల ఎకరాల్లో వరిసాగుకు నీళ్లు ఇవ్వడానికి జలవనరుల శాఖ అంగీకారం తెలిపింది. రబీలో మూడో పంట కింద జిల్లాలో 10వేల ఎకరాల్లో మినుములు, పెసల సాగుకు నిర్ణయించారు. మార్చి 31 నాటికి వరి కోతలు పూర్తయిన పొలాల్లో వీటిని సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. వరికోతలు ఆలస్యమైన చోట అవసరాల సాగుకు చేయకుండా నిలిపివేయనున్నారు. జూన్ 1 నుంచి గోదావరి కాలువలకు సాగునీరు సరఫరా చేసే నేపథ్యంలో మే 31లోగా మూడో పంట పూర్తి చేయాలని నిర్ణయించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. రబీ వరిసాగు పూర్తిగా వెదజల్లే విధానంలోనే సాగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# అతిథులొచ్చినప్పుడే మంచి భోజనం

అమలాపురం: పొంగలి బాగుండడం లేదు.. కోడిగుడ్లు నల్లగా ఉ ంటున్నాయి.. పాఠశాలకు అతిథులు, అధికారులు వచ్చినప్పుడు మాత్రమే సరైన భోజనం పెడుతున్నారు. మిగిలిన సందర్భాల్లో ఆహారం బాగుండడం లేదు. దోమల తెరలు లేకపోవడమేంటి.. తాగునీటి ట్యాప్‌ల వద్ద శుభ్రత లేదు.. పాడైన అరటి పండ్లు పిల్లలకు పెడతారా.. పాఠశాలలో శుభ్రతపై శ్రద్ధ పెట్టకపోవడం సరికాదు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం రూ.కోట్లలో ఖర్చు చేస్తుంటే మీరిలా వ్యవహరించడం సరికాదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం సమనసలోని మహాత్మా జ్యోతిరావు ఫులె బీసీ గురుకుల పాఠశాలలో పరిస్థితి. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో 'న్యూస్‌టుడే' బుధవారం పాఠశాలను పరిశీలించిన సమయంలో విద్యార్థులు పైవిధంగా స్పందించారు. పాఠశాలను సందర్శించిన రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సిబ్బంది తీరుపై మండిపడ్డారు. ఇక్కడ సుమారు 400 మంది విద్యార్థులు చదువుతున్నారు.

వీరందరికీ ఇక్కడే భోజనం, వసతి కల్పిస్తున్నారు. పాఠశాలలో ఆహారం బాగుండటం లేదని విద్యార్థులు చెబుతుంటే.. బయటి నుంచి తీసుకొచ్చిన ఆహారంతోనే అస్వస్థతకు గురయ్యారని పాఠశాల సిబ్బంది చెప్పుకొస్తున్నారు. పాఠశాలలోని గదుల కిటికీలకు దోమలు తెరలు



లేకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. కొన్నింటికి మాత్రమే దోమతెరలున్నాయని, అవి కూడా సక్రమంగా లేకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయన్నారు. ఆర్వో ప్లాంటు వద్ద తాగునీరు పట్టుకునే ట్యాప్‌ల వద్ద అపరిశుభ్రంగా ఉంది. మరుగు దొడ్లకు తలుపులు లేవు. వాష్‌బేసిన్‌ల వద్ద ట్యాప్‌లు పాడైపోయినప్పటికీ బాగు చేయించలేదు. గురుకుల పాఠశాల ప్రాంగణంలో దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో చీకటిగా ఉంటోంది. వసతి గదుల్లో ఫ్యాన్లు పని చేయడం లేదు. విద్యార్థులకు అస్వస్థతకు గురైన నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచి పాఠశాలలో విద్యుత్తు దీపాలు, ఫ్యాన్లు బాగుచేసే పనులను చేపడుతున్నారు.

# నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

రాజమహేంద్రవరం పంటల సాగులో నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధిం చవచ్చని, దీంతోపాటు మేలైన యాజమాన్య పద్ధతు లు, సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు పొందవచ్చని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) విత్తన వాణిజ్య పంటల అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డి.కె.యాదవ్ అన్నారు. రాజమహేంద్రవరం కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(సీటీఆర్ఐ) ప్లాటి నం జూబ్లీ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతి వెలిగిం చి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలను రూపొందించడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. దేశం నుంచి ఎగుమతి అయ్యే పొగాకుకు ప్రాధాన్యముందని, దీనిలో క్యాన్సర్ కారకాలను తగ్గించడానికి, పొగాకు పంట నుంచి ప్రత్యామ్నా య ఉత్పత్తులు సాధించే దిశగా పరిశోధనలు జరగాలన్నారు. మిరప, పసుపు, అశ్వగంధ, ఆముదం వంటి పంటలపై కూడా పరిశోధనలు చేయాలన్నారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ రైతులు అధిక ఆదాయం పొందేందుకు అనుసరిం చాల్సిన పద్ధతులపై విస్తృత పరిశోధనలు జరగాలని కోరారు.



పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ విదేశీ మారకద్రవ్యాన్ని పొందడానికి పొగాకు పంట ఉపయోగపడుతుంద న్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ కె.పద్మరాజు మాట్లాడుతూ సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారా న్ని కనుగొనేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. పొగాకు పంట, ఇతర వాణిజ్య వ్యవసాయంపై సీటీఆర్ఐ జరుపుతున్న పరిశోధనల గురించి ఆ సంస్థ డైరెక్టర్ శేషుమాధవ్ వివరించారు. సీటీఆర్ఐ 75 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానానికి చిహ్నంగా నిర్మించిన ప్రత్యేక పైలాన్‌ను, పలు సంచికలను అతిథులు ఆవిష్కరించారు.

# ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదు

## - అంగన్‌వాడీ సిబ్బంది

రాజమహేంద్రవరం: వైకాపా ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బంది సమస్య లను పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పలువురు నాయకులు హెచ్చరించారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండోరోజు కూడా కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి వేల సంఖ్యలో తరలివచ్చిన అంగన్ వాడీ టీచర్లు, సహాయకులు తమ సమస్యలపై గళం విప్పారు. పెద్దఎతు న నినాదాలు చేశారు. ప్రభుత్వం దిగివచ్చి డిమాండ్లు పరిష్కంచే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలు వురు నాయకులు శిబిరం వద్దకు వచ్చి మద్దతు పలికారు. రాజమహేంద్రవరం గ్రామీణం ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశారని, కనీసం అంగన్‌వాడీల సమస్యలను కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. జనసేన నాయకుడు బలరామకృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు



పెంచలేని ప్రభుత్వం సంక్షేమ పథకాలను కూడా నిలిపివేసిందన్నారు. సీపీఎం నాయకుడు అరుణ్ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలపై ప్రభు త్వం తీవ్ర భారాలు మోపి ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పోచమ్మ, జిల్లా ట్రెజరర్ వెంకటలక్ష్మి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజా, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జరీనా షరీఫ్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుందర్‌బాబు, రాజులోవ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్యాంబ, బేబీరాణి తదితరులు మాట్లాడారు.

# గుడ్డు ధర బాగు.. రైతే బేజారు

రంగంపేట,:కోడి గుడ్డు ధర రికార్డులు సృష్టిస్తున్నా.. ఆ రైతుల కళ్లలో ఆనందం లేదు. గుడ్డుపై రాబడిని దాణా ధరలు తన్నుకుపోవడమే ఇందుకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు, పెరిగిన గుడ్డు ధరతోనూ తేరుకోలేకపోతున్నారు. వచ్చే వేసవి నాటికి కొన్ని కోళ్ల పెంపకం షెడ్లను తొలగించేసేందుకు రైతులు సమా యత్తమవుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ఫారాల వద్ద కోడిగుడ్డు ధర రూ.5. 79 ఉండగా, బహిరంగ మార్కెట్లో రూ.6.50 లకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 16న రికార్డు స్థాయిలో ఈ ధర రూ.5.67 చేరగా, ఈ గురువారానికి అది రూ.5.79కి పెరిగింది. ప్రస్తుతం గుడ్లు కోల్‌కతా, బిహార్, అస్సాంలకు ఎగుమతి అవుతుండగా కార్తిక మాసం పూర్తయినందున స్థానికంగానూ విక్రయాలు పెరిగే వీలుందని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1.35 కోట్ల కోళ్లుండగా, రోజుకు కోటి గుడ్ల వరకు ఉత్పత్తి ఉంటుంది. దీంట్లో సింహ భాగం ఇతర రాష్ట్రాలకు ఎగుమతులున్నాయి. అయినా.. గుడ్డు ధర పెరుగుదల మూన్నాళ్ల ముచ్చటేనని, సంక్రాంతి తర్వాత ధర దిగజారి మళ్లీ కష్టాలు తప్పవని ఈ రైతులు చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని కోళ్లఫా రాలను ఇటీవల తొలగించగా, వేసవిలో అనపర్తి, పెద్దాపురం పరిసరాల్లో మరికొన్ని ఫారాల తొలగింపునకూ సిద్ధమవుతున్నారని సమాచారం. కోళ్ల దాణాకు వినియోగించే మొక్కజొన్న, వరి నూకలకు మార్కెట్లో డిమాండు



పెరగడమే ఈ రైతుల పాలిట నష్టాలకు కారణమని కొందరు విశ్లేషిస్తు న్నారు. మొక్కజొన్న నుంచి గ్లూటెన్ తీసే పరిశ్రమలు వేలాది టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేస్తున్నాయి. వాటితో పోటీ పడి కోళ్ల రైతులు మొక్కజొన్న కొనలేని పరిస్థితి. వరి నూక ఎగుమతులూ పెరిగాయి. సోయా, వేరుశనగ చెక్క, పొద్దుతిరుగుడు చెక్క, నూనె తీసిన తౌడు ధరలు పెరిగాయి. ఏడాదిలో కోడిగుడ్డు సరాసరి ధర కంటే, కోళ్ల దాణా ధర సరాసరి అధికంగా ఉండడమే కోళ్ల తమ నష్టాలకు కారణంగా రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ఏపీలో కోళ్ల పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం లేదంటున్నారు.

# కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

తిరుపతి:అంగన్‌వాడీలకు ఇచ్చిన మాటలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకోలేకపోయారని తెలుగుదేశం పార్టీ తిరుపతి ఇన్‌ఛార్జి సుగుణమ్మ ఆరోపించారు. అంగన్‌వాడీ సిబ్బంది నిరవధిక సమ్మె రెండో రోజుకు చేరుకుంది. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మెకు తెదేపా, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనని, కాంగ్రెస్ హయాంలో రూ.4,200 ఉన్న వేతనాన్ని రెండు విడతల్లో రూ.6,300, రూ.10,500 వరకు పెంచారని గుర్తుచేశారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీలకు రూ.వెయ్యి మాత్రమే పెంచిందని, సమస్యలు పరిష్కరిస్తామని దొంగ హామీలతో గద్దెనెక్కిన జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ సిబ్బందికి మోసం చేశారని విమర్శించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజు బుధవారం జిల్లా వ్యాప్తంగా కొనసాగింది. స్త్రీశిశు సంక్షేమశాఖ సీడీపీవో కార్యాలయాలు, మండల కేంద్రాల్లో తహసీల్దారు కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీలు నిరసన తెలియజేశారు. వారికి తెదేపా, సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలియజేసి నిరసన దీక్షలో పాల్గొన్నారు. చిత్తూరులో



సీడీపీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలియజేయగా మాజీ మేయర్ కఠారి హేమలత, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ తెదేపా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్‌తో పాటు పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు. యాదమరిలో తెదేపా మండల అధ్యక్షుడు మురార్జీయాదవ్, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి అమరనాథనాయుడు, నాయకులు సంఘీభావం తెలిపారు. అలాగే అన్ని మండల కేంద్రాల్లోనూ నిరసన ర్యాలీలు నిర్వహించి, తహసీల్దారు కార్యాలయాల ఎదుట నిరసన తెలియజేశారు.

# రేషన్ వస్తువుల్లో కొరత..పెద్ద ఎత్తున ఆందోళన

కర్నూలు : ఎమ్మిగనూరులో రేషన్ వాహనం ఎదుట మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా ఏదో ఒకటి రావడంలేదని ఆరోపించారు. కందిపప్పు ఇస్తే గోదుమ పిండి ఇవ్వడంలేదని, కొన్నిసార్లు షుగర్ కూడా సరఫరా చేయడంలేదన్నారు. కార్డు మీద కనీసం కందిపప్పు, గోధుమపిండి ఇవ్వకపోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బియ్యం కూడా వద్దని రేషన్ వాహనాన్ని వెనక్కి పంపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ బియ్యం ఒక్కటే ఇస్తున్నారని, ఇదివరకు అన్ని ఇచ్చేవారని, ఈసారి ఎందుకు ఇవ్వడంలేదని వారు ప్రశ్నించారు.అన్ని సరుకులు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



# ఇంధన పొదుపు.. భవిష్యత్తుకు మలుపు



మిర్యాలగూడ :యంత్రాన్ని బట్టి ఆశక్తిని పలు రకాల ఇంధనాలు అందిస్తాయి. మారిన ఆధునిక పరిస్థితులు, విపరీతంగా పెరిగిన యాంత్రీకరణ నేపథ్యంలో ఇంధన వాడకం గత పదేళ్లలో భారీగా పెరిగింది. విద్యుత్తు, గ్యాస్‌తో పాటు పెట్రోల్, డీజిల్ మానవ మనుగడలో ముఖ్య పాత్ర పోషించే ఇంధనాలు. డిమాండ్‌కు అనుగుణంగా ఇంధన ఉత్పత్తి పెరగకపోవడంతో ప్రస్తుత రోజుల్లో ఇంధన కొరత ఏర్పడుతోంది. దీంతో ధరలు భారీగా పెరిగిపోతున్నాయి. వీటికి తోడు విపరీతంగా ఇంధనాన్ని వాడడంతో పర్యావరణ కాలుష్యంపైనా ప్రభావం పడుతోంది. ప్రజలకు ఇంధన పొదుపుపై అవగాహన కల్పించడమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. అవసరానికి మించి ఇంధనాన్ని వాడకుండా అవకాశం ఉన్నంత వరకు తక్కువ ఇంధనాన్ని వినియోగిస్తూ.. ఎక్కువ పనులు చేసేలా జాగ్రత్త పడాలని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో పాటు ఇంధన పరిరక్షణకు కృషి చేస్తున్న వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలకు అవార్డులు సైతం అందిస్తారు. ఆర్టీసీ డ్రైవర్లకు ప్రతి నెలా ఇంధన పొదుపు అవార్డులు అందించి ప్రోత్సహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో నల్గొండ ఆర్టీఏ కార్యాలయం పరిధిలో ఏడాది కాలంలో 17వేలకు పైగా వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా.. మిర్యాలగూడ యూనిట్ కార్యాలయం పరిధిలో 10 వేలకు పైగా వాహనాలు నమోదయ్యాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 4 లక్షలకు పైగా వాహనాలున్నాయి. సూర్యాపేట జిల్లాలో 1.80 లక్షల వాహనాలు, కోదాడలో 99 వేలకు పైగా వాహనాలున్నాయి. యాదాద్రి జిల్లాలోనూ సుమారు 2లక్షల వాహనాలున్నాయి. ఇవన్నీ అధికారిక లెక్కల ప్రకారమే.. ఇవి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవి, కాలం చెల్లినవి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 2 లక్షల వరకు ఉంటాయని అంచనా. గతంలో ఇంటికి ఒక్క వాహనం ఉంటేనే గొప్ప అనుకునే రోజుల నుంచి మారిన ఆర్థిక సరళీకృత విధానాలతో ప్రస్తుతం ఇంటికి రెండుకు పైగా వాహనాలున్నాయి. మరో అత్యవసర ఇంధనమైన విద్యుత్తు వినియోగం సైతం విపరీతంగా పెరిగింది. దీనికి తోడు వినియోగించే విద్యుత్తు కంటే వృథా అయ్యే విద్యుత్తు అధికంగా ఉంటోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, గ్రామాల్లో వీధి దీపాలు అమర్చారు. రెండేళ్ల క్రితం వీధి దీపాలకు సైతం ప్రత్యేక మీటర్లు అమర్చిన విద్యుత్తు శాఖ.. స్థానిక సంస్థల నుంచి బిల్లులు వసూలు చేయాలని నిర్ణయించింది. కానీ వీధి దీపాల నిర్వహణలో స్థానిక సంస్థల నిర్లక్ష్యంతో పగలు, రాత్రి తేడా లేకుండా దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. దీనికి తోడు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో లైట్లు, ఫ్యాన్లు ఎవరూ లేకపోయినా తిరుగుతూనే ఉంటాయి. దీంతో వేల యూనిట్ల విద్యుత్తు వృథా అవుతుంది

# పరికరాల కొరత.. వసతుల లేమి

గోదావరిఖని: వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న సింగరేణిలో కార్మికులకు సౌకర్యాలు నేటికీ మెరుగుపడటం లేదు. కనీసం వారికి సరఫరా చేసే పనిముట్ల విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రక్షణ పరికరాల్లో నాణ్యత లోపిస్తోంది. బొగ్గు ఉత్పత్తిలో రికార్డు సాధిస్తున్న సింగరేణి గనుల్లో పనిచేసే కార్మికులకు సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. బొగ్గు ఉత్పత్తిలో శ్రమించే కార్మికులకు వారుచేసే పనికి సంబంధించిన పనిముట్లు సైతం అందు బాటులో ఉండటం లేదు. అవసరం మేరకు పనిముట్లు లేకపోవడంతో ఉన్న వాటితోనే సర్దుకుని పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కార్మిక సంఘాలు ప్రతి ఎన్నికల్లో సంక్షేమాన్ని ప్రస్తావిస్తున్నా వాటిని అమలు చేయించడంలో విఫలమవుతున్నాయి. ఇప్పటి వరకు ఆరుసార్లు ఎన్నికలు జరిగినా కార్మికుల సౌకర్యాలు మాత్రం మెరుగుపడటం లేదు. కనీసం పని స్థలాల్లో మౌలిక వసతులు లేవని కార్మికులు వాపోతు న్నారు. గుర్తింపు ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేస్తున్న కార్మిక సంఘాలు ఈసారైనా కార్మికుల సంక్షేమం.. సౌకర్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గనులపై కార్మికుల సంక్షేమం కానరావడం లేదు. కనీసం దుస్తులు భద్రపరుచుకునేందుకు ర్యాక్‌లు ఏర్పాటు చేస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. డ్యూటీ దుస్తులతో పాటు బూట్లు, ఇతర సామగ్రిని భద్రపరచుకునేందుకు ప్రతి గనిపై లాకర్లు ఏర్పాటు చేస్తామన్న విషయాన్ని ఎవరు పట్టించుకోలేదు. గత ఎన్నికల సమయంలో ఈ విషయాన్ని ప్రస్తావించినా ఇప్పటి వరకు ఏ ఒక్క గనిలో వాటిని ఏర్పాటు చేయలేదు. ఒకటి రెండు గనుల్లో ప్రయోగాత్మకంగా లాకర్ల కోసం పనులు మొదలు పెట్టినా వాటిని మధ్యలోనే నిలిపివేశారు. కార్మికులు తమ దుస్తులు భద్రపరచుకోవడానికి గనులవద్ద చెక్కపెట్టెలు తయారు చేసుకుని వాటిలో దాచుకుంటున్నారు.



బూట్లకు తాళాలు వేసుకుని కాపాడుకుంటున్నారు. గనుల్లో పనులు ముగించుకుని బయటకు వచ్చే కార్మికులు స్నానాలు చేసేందుకు గనులపై గదులు ఏర్పాటు చేయాలన్న విషయాన్ని అధికారులు విస్మరించారనే ఆరోపణలున్నాయి. స్నానానికి అవసరమైన వేడి నీళ్ల కోసం బాత్‌రూంలలో గీజర్లు ఏర్పాటు చేయిస్తామన్న హామీలు ఇప్పటికీ నెరవేరలేదు. గనులపై అల్పాహారం కోసం ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లలో శుభ్రత పాటించడం లేదని పలువురు అంటున్నారు. వీటిపై సంఘాలు దృష్టి సారించాలని కార్మికులు కోరుతున్నారు. ొగ్గుగనుల్లో పనిచేసే కార్మికులకు అవసరమైన పనిముట్లు అందుబాటులో లేకపోవడంతో అరకొర సామగ్రితోనే గనుల్లోకి వెళుతున్నారు. కోల్‌కట్టర్‌లు వినియోగించే డ్రిల్‌రాడ్‌లు, డ్రిల్‌బిట్‌లు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ప్రతీరోజు ఉన్న వాటితోనే పనులు చేయాల్సి వస్తుంది. అరిగిపోయిన డ్రిల్‌రాడ్‌లను రెండు అతికించుకుని పనిచేస్తున్న సందర్భాలున్నాయి. నాణ్యత లేని డ్రిల్‌బిట్‌లు సరఫరా చేయడంతో కొద్ది కాలానికే అవి పనిచేయకుండా పోతున్నాయి. వాటిని తిరిగి పదును చేయించుకుని పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

# విద్యార్థుల సమాచారం ఒకేచోట

భువనగిరి: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సమగ్ర సమాచారం ఇక నుంచి ఒకే చోట లభ్యం కానుంది.పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు 2024–25 విద్యా సంవత్సరం నుంచి యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) పకడ్బందీగా అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. పాఠశాలల సమగ్ర సమాచారం యూడైస్‌లో నిక్షిప్తం చేసేందుకు ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 12లోగా పాఠశాలల్లోని విద్యార్థుల, ఉపాధ్యాయుల, మౌలిక సదుపాయాల పూర్తి సమాచారాన్ని నిక్షిప్తం చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికి సాంకేతిక కారణాలతో జాప్యం నెలకొంది. నాలుగు రోజుల వ్యవధిలో పూర్తి చేయడానికి కసరత్తు జరుగుతోంది. యూడైస్‌లో విద్యార్థుల పేరు ఉంటేనే ప్రభుత్వం ద్వార అందిస్తున్న అన్ని సదుపాయాలు, వసతులు సమకూరుతాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో 3,460 పాఠశాలలు పనిచేస్తున్నాయి. 1,86,742 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు వివరాలు ఇది వరకే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీనికి మిగిలిన వివరాలు జోడించి సమగ్ర సమాచారం రూపొందిస్తున్నారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, మౌలిక వసతుల సమాచారం వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా అన్ని పాఠశాలల వివరాలు ఒకే చోట కనిపిస్తాయి. పాఠశాలలు మూసి వేసిన, ప్రారంభించిన వెంటనే వచ్చిన మార్పులను తక్షణమే



నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ భవిష్యత్‌లో పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేసేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. యూడైస్‌లో నమోదైన వివరాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నెల 12లోపు ప్రధానోపాధ్యాయులు పాఠశాలల వివరాల నమోదు పూర్తి చేయాల్సి ఉంది. నమోదు చేసిన వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అన్న విషయాలను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు 100 శాతం పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తారు. అనంతరం జిల్లా విద్యాధికారి 5 శాతం పాఠశాలలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులు నివేదిక అందిస్తారు. నమోదైన సమాచారం రెండంచెల విధానంలో పరిశీలన కొనసాగనుంది.

# కొత్త ప్రభుత్వంపై విలీన వీఆర్‌ఏల ఆశలు

సిరిసిల్ల కలెక్టరేట్: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యలో అనుసంధానంగా వ్యవహరించిన వీఆర్‌ఏలను పదోన్నతుల ద్వారా ప్రభుత్వం వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. అయితే అప్పటి నుంచి వీరికి జీతాలు చెల్లించడంలేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంపై వీరు ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరిస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమైన నిర్లక్ష్యానికి గురైన వీఆర్‌ఏలు చాలా తక్కువ వేతనం నుంచి పని చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయే నాటికి రూ. 6 వేల వేతనం అందుకున్నారు. తమ బతుకులు మారాలని అనేక పోరాటాలు చేసిన వీఆర్‌ఏలకు తెలంగాణ ప్రభు త్వం వచ్చాక వేతనాన్ని రూ.10,500 వేలకు పెంచింది. 2016, 2020 సంవత్సరాల్లో అసెంబ్లీలో ముఖ్యమంత్రి వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పిస్తామని, వారి వారసులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన రెవెన్యూ చట్టంతో ప్రమోషన్ ఇచ్చేందుకు అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది. ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో గత సంవత్సరం వీఆర్‌ఏలు సమ్మెబాట పట్టి 80 రోజులు విధులకు దూరంగా ఉన్నారు. సమ్మె విరమించి చర్చలకు వస్తేనే వీఆర్‌ఏల గురించి ఆలోచిస్తామని గత ప్రభుత్వం తెలపడంతో చర్చలకు వెళ్లారు. వీఆర్‌ఏల ప్రతినిధులతో చర్చలు జరిపి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్.81 ప్రకారం వారిని పురపాలక సంఘం, ఇరిగేషన్, మిషన్ భగీరథ, రెవెన్యూ ఇలా వివిధ శాఖల్లో పదోన్నతులపై నియమిస్తూ 10.8.2023న వారికి అపాయింట్‌మెంట్ లెటర్లను అందజేసింది. అప్పటి వరకు రూ.10,500 వేతనం అందుకున్న



వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో పదోన్నతులపై సర్దుబాటు చేసింది. అయితే వారికి నేటికీ జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. జీతాలు చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా స్పందన లేదు. జిల్లాలో 345 మంది వీఆర్‌ఏలకు పదోన్నతులు ఇచ్చి మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల్లో సర్దుబాటు చేయగా, కొందరిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు పంపించారు. వీరిలో 10వ తరగతి వరకు చదివిన వారిని ఆఫీస్ సబార్డినేట్‌గా, ఇంటర్ చదివిన వారిని రికార్డు అసిస్టెంట్‌గా, డిగ్రీ పూర్తి చేసిన వారికి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పించారు. అప్పటి నుంచి ఆయా శాఖల్లో పని చేస్తున్న వీరు తాత్కాలిక రిజిస్టర్‌లోనే ప్రతి రోజు సంతకాలు చేస్తున్నారు. జీతాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేదని వాపోతున్నారు.

# వివరాల నమోదుపై మహాలక్ష్మి ప్రభావం




పెద్దపల్లి: గ్యాస్ వినియోగదారులు ఏజెన్సీల వద్ద వ్యక్తిగత వివరాలు(ఈ–కేవైసీ) నమోదు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. మరోవైపు తాము అధికారంలోకి వస్తే 'మహాలక్ష్మి' పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండరును అందిస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. దీంతో కొద్ది రోజులుగా ఏజెన్సీ కార్యాలయాలకు వినియోగదారుల తాకిడి పెరిగింది. ఈ–కేవైసీ నమోదుకు గడువు ఏమీ లేదని అధికారులు చెబుతుండగా, ఆలస్యమైతే పథకానికి తాము దూరమైతామేమోనని లబ్ధిదారులు ఆతృత పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన'(పీఎంయూవై) కింద గతంలో పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఈ పథకం కింద దాదాపు 1,56,000 మంది మహిళలు లబ్ధి పొందారు. వీరందరూ సమీపంలోని గ్యాస్ ఏజెన్సీలకు వెళ్లి తమ వేలిముద్రలను, అప్‌డేట్ చేసిన ఆధార్, గ్యాస్ పాస్‌పుస్తకాల వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చమురు సంస్థలు కేవలం ఉజ్వల పథకం లబ్ధిదారులు మాత్రమే ఈ కేవైసీ వివరాలు ఇవ్వాలని కోరాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండరు అందజేసేందుకే ఈ వివరాలు ఇవ్వమంటున్నారని భావించి వినియోగదారులందరూ ఏజెన్సీల బాట పడుతున్నారు. హెచ్‌పీ, ఇండియన్, భారత్ తదితర చమురు సంస్థల డీలర్లు కూడా ఈ విషయంలో అవగాహన కల్పించకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 13.38 లక్షల గ్యాస్ కనెక్షన్లున్నాయి. అందులో 10.77 లక్షలు గృహావసర, 2.61 లక్షలు వాణిజ్య అవసరాలవి. పెరిగిన ధరలతో ఇప్పటికే గృహావసర వినియోగదారులపై రూ.5.40 కోట్లు, వాణిజ్య వినియోగదారులపై రూ.9.14 కోట్ల భారం అదనంగా పడుతోంది. 14.2 కిలోల గృహావసరాల సిలిండరు ధర ప్రస్తుతం రూ.975 ఉండగా, రాయితీ కింద ప్రభుత్వం వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.47 చొప్పున జమ చేస్తోంది. ఇక ఉజ్వల వినియోగదారులు కూడా రూ.975 చెల్లిస్తుండగా వారికి రూ.200 చొప్పున రాయితీ ఖాతాల్లో జమవుతోంది. ప్రస్తుతం వాణిజ్య సిలిండరు ధర రూ.2,058గా ఉంది.

# ఎట్టకేలకు అంగన్‌వాడీలకు సన్నబియ్యం

హుజూరాబాద్: ఎట్టకేలకు అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం సరఫరా అవుతోంది. ఇన్నాళ్లు బాలింతలు, గర్భిణులు, చిన్నారులు దొడ్డు బియ్యంతో వండిన భోజనం తినలేక ఇబ్బంది పడేవారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని కేంద్రాలకు గత నెల నుంచి సన్నబియ్యం సరఫరా అవుతుండటంతో లబ్ధిదారులకు దొడ్డన్నం తిప్పలు తప్పినట్లయింది. సన్నబియ్యంతో వండిన భోజనాన్ని తీసుకునేందుకు చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలు ఆసక్తి చూపుతున్నారని కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. గత ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, పాఠశాలలు, కళాశాలల్లో సన్న బియ్యంతో భోజనం ఏర్పాటు చేసింది. ఇదే తరహాలో అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సన్నబియ్యంతో భోజనం పెట్టేలా ఆరేళ్ల కిందట ప్రభుత్వం ప్రకటించింది. కానీ పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. గత ఏప్రిల్ నెలలో అంగన్‌వాడీ కేంద్రా లకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. కానీ ఏడు నెలలైనా సన్నబియ్యం సరఫరా కాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు కోడిగుడ్లు, పాలు, బాలామృతం, కుర్‌కురే, పప్పులు.. తదితర పౌష్టికాహారంతోపాటు నిత్యం దొడ్డు బియ్యంతో భోజనం తయారు చేశారు. పాలు, గుడ్లు, బాలామృతం తీసుకుంటున్న ఇష్టంగా దొడ్డు బియ్యంతో తయారు చేసిన భోజనాన్ని తీసుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. ఏళ్ల తరబడి ఎదురు చూపుల తరవాత



అంగన్‌వాడీ కేంద్రాలన్నింటికి సన్నబియ్యం సరఫరా అవుతుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు దొడ్డన్నం తినలేక అవస్థలు పడ్డ లబ్ధిదారులు ఇప్పుడు సన్నబియ్యంతో చేసిన భోజనాన్ని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 13 ప్రాజెక్టుల్లో 3,135 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 76,240 మంది 3–6 ఏళ్ల లోపు చిన్నారులు, 20,140 మంది గర్భిణులు, 19,500 మంది బాలింతలు ఉన్నారు. ప్రతీనెలా సరాసరి ఒక్కో కేంద్రానికి 60 నుంచి 70 కిలోల బియ్యం పంపిణీ జరుగుతోంది. చిన్నారులకు ఒక్కోక్కరికి 75 గ్రాములు, బాలింతలు, గర్భిణులు, బాలింతలకు 150 గ్రాముల చొప్పున దొడ్డు బియ్యంతో చేసిన భోజనాన్ని వడ్డిస్తున్నారు.

# బకాయిల భారం.. నిర్వహణ కష్టం



సిరిసిల్ల: జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పురపాలక సంఘంలో నిధుల లేమితో ప్రధాన పనులేవీ ముందుకు సాగడం లేదు. వీటికితోడు రెండు నెలలుగా కమిషనరు సెలవుపై వెళ్లడంతో కార్యాలయ పాలన గాడి తప్పింది. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు తొమ్మిది ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేశారు. వీటితోపాటు పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రధాన రహదారుల మధ్యలో చెట్లు, కూడళ్లలో పూల మొక్కలు పెంచుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా వీటి నిర్వహణ గాడి తప్పుతోంది. పార్కులు, ప్రధాన రహదారులపై ఉన్న కూడళ్ల సుందరీకరణకు ఏటా పురపాలకశాఖ రూ.66 లక్షలు కేటాయిస్తోంది. వీటి నిర్వహణను రెండు గుత్తేదారు సంస్థలకు అప్పగించారు. వీరు పట్టణ వ్యాప్తంగా 45 మంది కూలీలు, పది మంది సూపర్‌వైజర్లను ఏర్పాటు చేశారు. దాదాపు పది నెలలుగా పురపాలిక నుంచి గుత్తేదారులకు బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో వీరి పరిధిలో పని చేసే కూలీలు, సూపర్‌వైజర్లకు వేతనాలు అందడం లేదు. ఈ విషయంపై ఇటీవల పార్కుల్లో పని చేసే కూలీలంతా పురపాలిక ఎదుట ఆందోళనకు దిగారు. అధికారులు, కౌన్సిలర్లు నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు. గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లులన్నీ సాధారణ నిధుల నుంచి కేటాయిస్తారు. ఏడాదిగా పురపాలికలో సాధారణ నిధులు లేకపోవడంతో ఏ పనులూ ముందుకు సాగడం లేదు. పురపాలిక ఎన్నికలకు ముందు సిరిసిల్ల పట్టణంలో ఏడు గ్రామాలు విలీనమయ్యాయి. వీటిలో అభివృద్ధి పనులకు పలు విడతల్లో రూ.40 లక్షలు కేటాయించారు. కానీ ఖజానాలో నిధులు లేక ఈ పనులేవీ ముందుకు సాగడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో స్థానికులకు ఇక్కట్లు తప్పడం లేదు. పంచాయతీలుగా ఉన్నప్పుడు నిర్మించిన మురుగు కాల్వలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చాలా చోట్ల మురుగు సాఫీగా వెళ్లని పరిస్థితి ఏర్పడింది. వాతావరణ పరిస్థితులు మారడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. సిరిసిల్ల పురపాలక సంఘం అధికారులు రగుడు నుంచి కార్గిల్‌లేక్ వరకు ఆక్రమణలకు గురయ్యాయి. వర్షాలకు కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో చాలా చోట్ల టైల్స్ కుంగిపోయాయి. వీటి మరమ్మతులకు ఇంజినీరింగ్ విభాగం ఇప్పటికే నాలుగు సార్లు టెండర్లు పిలిచింది. సాధారణ నిధులని చెప్పడంతో గుత్తేదారులు ఎవరూ ముందుకు రావడం లేదు.

## త్వరలో పూణే - సికింద్రాబాద్ మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్

సికింద్రాబాద్: పూణే– సికింద్రాబాద్ మధ్య కనెక్టివిటీని పెంచుతూ, దక్షిణ మధ్య రైల్వే త్వరలో రెండు నగరాల మధ్య కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. కొత్త మార్గాల్లో ఈ వందే భారత్‌ను నడిపేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. దేశవ్యాప్తంగా సెమీ–హై స్పీడ్ రైలు సేవలను మరింత విస్తరించేందుకు భారతీయ రైల్వే చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా, దక్షిణ మధ్య రైల్వే త్వరలో సికింద్రాబాద్ – పూణేల మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను, ఇతర 9 మార్గాల్లో ఈ వందేభారత్‌సేవలను ప్రారంభించాలని యోచిస్తోంది కేంద్ర ప్రభుత్వం. ఈ కొత్త రైలు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోకి వచ్చే సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌కు చెందినది. శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్థానంలో వందేభారత్ రైళ్లను ఏర్పాటు చేయాలని రైల్వే ఇప్పటికే నిర్ణయించింది. రెండు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఒకటి సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య, మరొకటి సికింద్రాబాద్–తిరుపతి మధ్య ఇప్పటికే నడుస్తున్నాయి. అయితే, ప్రయాణికులలో హైస్పీడ్ రైళ్లకు నానాటికీ పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా, సౌత్ సెంట్రల్ రైల్వే



సేవలను మరింత విస్తరించాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా త్వరలో ప్రారంభించనున్న 10 కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఒకటి సికింద్రాబాద్ – పూణే మార్గంలో ప్రవేశ పెట్టనున్నారు. ఇది అత్యంత రద్దీగా ఉండే వాటిలో ఒకటిగా పరిగణిస్తున్నారు. సికింద్రాబాద్–పూణే కాకుండా, వారణాసి–లక్నో, పాట్నా–జల్పాయిగురి, మడ్గావ్–మంగళూరు, ఢిల్లీ–అమృతసర్, ఇండోర్–సూరత్, ముంబై–కొల్హాపూర్, ముంబై–జల్నా, పూణే–వడోదర, టాటానగర్–వారణాసి సెక్షన్ల మధ్య కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్లాన్ చేస్తున్నారు.

# తరానికొక్క ఆటగాడు.. ముంబై అలా చేయకపోతే టీమిండియాకు నష్టం



టీమిండియా ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఉద్దేశించి పాకిస్తాన్ మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అద్భుతమైన నైపుణ్యాలున్న ఈ స్టార్ బౌలర్‌పై పనిభారాన్ని తగ్గించే బాధ్యత బీసీసీఐపై ఉందన్నాడు.

అదే విధంగా.. బుమ్రా ప్రాతినిథ్యం వహిస్తున్న ఐపీఎల్ ఫ్రాంఛైజీ ముంబై ఇండియన్స్ కూడా అతడిపై భారం పడకుండా కాపాడుకోవాలని సూచించాడు.

టీ20 ప్రపంచకప్-2024కు ఎక్కువగా సమయం లేదు కాబట్టి బుమ్రాకు ఎంత ఎక్కువ విశ్రాంతినిస్తే అంత మంచిదని కనేరియా అభిప్రాయపడ్డాడు. కాగా వన్డే వరల్డ్‌కప్-2023 తర్వాత సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్ సందర్భంగా మళ్లీ మైదానంలో దిగాడు బుమ్రా.

సఫారీ గడ్డపై అద్భుత ప్రదర్శనతో అదరగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. తద్వారా ఈ ఘనత సాధించి తొలి భారత క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్టుల్లో కలిపి మొత్తంగా 12 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడీ రైటార్మ్ పేసర్. తద్వారా టీమిండియా సిరీస్‌ను డ్రా చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. ఇక ఈ సిరీస్ తర్వాత బుమ్రా మళ్లీ ఇంగ్లండ్‌తో స్వదేశంలో జరిగే టెస్టు సిరీస్ ద్వారానే బంతితో రంగంలోకి దిగే అవకాశం ఉంది. ఆ తర్వాత అతడు ఐపీఎల్-2024తో బిజీ కానున్నాడు. ఈ నేపథ్యంలో డానిష్ కనేరియా తన యూట్యూబ్ చానెల్ వేదికగా బుమ్రా గురించి మాట్లాడుతూ కీలక సూచనలు చేశాడు.

"జస్ప్రీత్ బుమ్రాకు ఇంకెంతో భవిష్యత్తు ఉంది. సుదీర్ఘకాలం పాటు అతడు కెరీర్ కొనసాగించాలంటే టీమిండియా మేనేజ్‌మెంట్ అతడిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఫాస్ట్ బౌలర్ కాబట్టి తరచూ గాయాల బారిన పడటం సహజం.

అందుకే అతడి విషయంలో మరింత జాగ్రత్త అవసరం. బీసీసీఐతో పాటు ముంబై ఇండియన్స్ కూడా బుమ్రా విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. ఒకవేళ ముంబై తరఫున అతడిని ఐపీఎల్‌లో విశ్రాంతి లేకుండా ఆడిస్తే టీమిండియాకు కచ్చితంగా పెద్ద ఎదురుదెబ్బే తగులుతుంది.

అతడు టీమిండియాకు విలువైన ఆస్తి. తరానికొక్క ఆటగాడు. అందుకే జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నా" అని కనేరియా పేర్కొన్నాడు. ఐపీఎల్ తాజా ఎడిషన్ తర్వాత టీమిండియా ప్రపంచకప్ టోర్నీ ఆడాల్సి ఉంది కాబట్టి ముంబై ఇండియన్స్ ఆఖరి దశ మ్యాచ్‌లలో బుమ్రాకు రెస్ట్ ఇవ్వాలని సూచించాడు. కాగా వెన్నునొప్పి కారణంగా బుమ్రా టీ20 ప్రపంచకప్-2022కు దూరమైన విషయం తెలిసిందే.

# రెండు మ్యాచ్‌ల సిరీస్‌తో ఒరిగేదేమీ లేదు..



దక్షిణాఫ్రికా పర్యటనను భారత జట్టు విజయంతో ముగించింది. సిరీస్ డిసైడర్ అయిన కేప్‌టౌన్ టెస్టులో రోహిత్ సేన చిరస్మరణీయ విజయంతో సిరీస్ సమం చేసింది.

అయితే.. 'మరో మ్యాచ్ ఉండి ఉంటే టీమిండియా సిరీస్ కచ్చితంగా గెలిచేది' అని కోట్లాది మంది అభిమానులతో పాటు మాజీ క్రికెటర్లు నిట్టూర్చారు. భారత మాజీ కోచ్ రవి శాస్త్రఅయితే రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను తప్పుపట్టాడు. 'రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌తో టైమ్ వేస్ట్ తప్ప ఒరిగేదేమీ లేదు. అందుకని భవిష్యత్తులో టీమిండియా ఏ జట్టుతోనైనా రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడేందుకు అంగీకరించొద్దు' అని శాస్త్రి అభిప్రాయపడ్డాడు. 1983లో వరల్డ్ కప్ గెలుపొందిన జట్టులో సభ్యుడైన రవి శాస్త్రి భారత కోచ్‌గా నాలుగేండ్ల పాటు సేవలందించాడు. సిరీస్‌తో దక్షిణాఫ్రికా, భారత ఆటగాళ్లు

వరల్డ్ నంబర్ 1గా దక్షిణాఫ్రికాపై గడ్డపై అడుగుపెట్టిన రోహిత్ సేన సెంచూరియన్‌లో భంగపడింది. డీన్ ఎల్గర్ శతకానికి తోడు రబడ, బర్గర్ చెలరేగడంతో ఇన్నింగ్స్ 32 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. అయితే.. సిరీస్ డిసైడర్ అయిన కేప్‌టౌన్‌లో భారత బౌలర్లు సిరాజ్, బుమ్రా సంచలన బౌలింగ్‌తో సఫారీలకు చెమటలు పట్టించారు. దాంతో, రోహిత్ శర్మ బృందం రెండో రోజే 7 వికెట్ల తేడాతో చిరస్మరణీయ విజయం సాధించింది.

న్యూలాండ్స్ మైదానంలో తొలి టెస్టు విజయం నమోదు చేసిన ఆసియా జట్టుగా రికార్డు నెలకొల్పింది. అంతేకాదు 12 కీలక పాయింట్లు సాధించిన భారత జట్టు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్-25 పట్టికలో మళ్లీ అగ్రస్థానానికి చేరుకుంది.

# కొత్త ఏడాదిలో అదిరిన బోణీ.. డబ్ల్యూటీసీలో మళ్లీ అగ్రస్థానానికి టీమిండియా



కొత్త ఏడాది మొదలైన నాలుగు రోజుల్లోనే భారత జట్టు అదిరిపోయే బోణీ కొట్టింది. వరల్డ్ నంబర్ 1గా దక్షిణాఫ్రికాపై గడ్డపై అడుగుపెట్టిన రోహిత్ సేన కీలకమైన కేప్‌టౌన్‌లో చిరస్మరణీయ విజయం సాధించింది. రెండు టెస్టుల సిరీస్‌ను సమం చేయడమే కాకుండా 12 కీలక పాయింట్లు సాధించింది. దాంతో, ప్రపంచ టెస్టు చాంపియన్‌ షిప్- 25 పట్టికలో మళ్లీ అగ్రస్థానానికి చేరుకుంది.

ప్రస్తుతం భారత్ 54.16 విజయాల శాతంతో టాప్‌లో ఉండగా.. 50 శాతంతో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. నిరుడు టెస్టు గదను తన్నుకుపోయిన ఆస్ట్రేలియా నాలుగో స్థానం దక్కించుకోగా.. న్యూజిలాండ్‌పై తొలి టెస్టు విజయంతో చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్ ఐదో స్థానంలో ఉంది.

నిరుడు డబ్ల్యూటీసీ ఫైనల్లో ఓటమి అనంతరం భారత జట్టు.. వెస్టిండీస్ పర్యటనలో టెస్టు సిరీస్ సమం చేసింది. దాంతో డబ్ల్యూటీసీ 2023-25 సైకిల్‌లో పాకిస్థాన్‌తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచింది. 2024 ఆరంభంలోనే సఫారీలపై సంచలన విజయంతో భారత్ మళ్లీ నంబర్ 1 ర్యాంక్ కైవసం చేసుకుంది. ఐసీసీ 2021లో తొలిసారి ప్రవేశ పెట్టిన ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భారత జట్టు ఫైనల్ చేరింది.

టెస్టు గదతో ఆస్ట్రేలియా జట్టు, నిర్వేదంలో రోహిత్ శర్మ

కానీ, న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ కైలీ జేమీసన్ విజృంభణతో అనూహ్యంగా ఓటమి పాలైంది. నిరుడు కూడా సంచలన ప్రదర్శనతో టైటిల్ పోరుకు అర్హత సాధించిన టీమిండియా ఓవల్ స్టేడియంలో ప్యాట్ కమిన్స్ సేన చేతిలో కంగుతిన్నది. రెండు సార్లు చేతి దాకా వచ్చి అందకుండా పోయిన టెస్టు గదను ఈసారి దక్కించుకోవాలని భార జట్టు కసితో ఉంది.

# బాక్సింగ్ డే టెస్టులో పాక్ బేజారు

## విజయానికి చేరువైన ఆస్ట్రేలియా



స్వదేశంలో పాకిస్థాన్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో ఆస్ట్రేలియా విజయానికి చేరువైంది. స్టార్ పేసర్ హేజిల్‌వుడ్ చెలరేగడంతో పాకిస్థాన్‌ను ఆలౌట్ ప్రమాదంలోకి నెట్టింది.


ఆసీస్ పేసర్ల దెబ్బకు రెండో ఇన్నింగ్స్‌లో పాక్ 7 వికెట్ల నష్టానికి 68 పరుగులు చేసింది.

ప్రస్తుతానికి సాద్ షకీల్ సేన 82 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. మహ్మద్ రిజ్వాన్(6 నాటౌట్) ఒంటరి పోరాటం చేస్తున్నాడు. నాలుగో రోజు టెయిలెంటర్లతో కలిసి రిజ్వాన్ ఎన్ని పరుగులు జోడిస్తాడనేది చూడాలి.

మూడో రోజు ఆస్ట్రేలియాను 299 పరుగులకే ఆలౌట్ చేసిన పాకిస్థాన్‌ను హేజిల్‌వుడ్ ముప్పతిప్పలు పెట్టాడు. ఆదిలోనే కెప్టెన్ షాన్ మసూద్(0) ఔట్ చేసిన ఈ పేసర్.. టీ సెషన్‌లో ఒకే ఓవర్లో సాద్ షకీల్(20), సాజిద్ ఖాన్(0), అగా సల్మాన్(0)లను ఔట్ చేసి పాక్‌ను కోలుకోలేని విధంగా దెబ్బ కొట్టాడు. దాంతో, మసూద్ బృందం 67 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది.

తొలి ఇన్నింగ్స్‌లో లబూషేన్(60), మిచెల్ మార్ష్(54) అర్ధ శతకాలతో రాణించారు. చివర్లో వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ(38) విలువైన పరుగులు జోడించడంతో ఆస్ట్రేలియా 299 పరుగులు చేసింది. పాక్ పేసర్ అమర్ జమాల్ 6 వికెట్లు తీయడంతో కంగారూలు భారీ స్కోర్ చేయలేకపోయారు.

# తిరుగులేని టాప్ సీడ్లు.. క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ బుల్




ఆస్ట్రేలియాలో జరుగుతున్నబ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టోర్నీలో టాప్ సీడ్లు రఫ్ఫాడిస్తున్నారు. మరో వైపు ఏడాది తర్వాత పునరాగమనం చేసిన మాజీ వరల్డ్ నంబర్ 1 రఫెల్ నాదల్ జోరు కొనసాగిస్తున్నాడు.

తొలి పోరులోనే మూడో సీడ్ డోమ్నిక్ థీమ్‌ను చిత్తు చేసిన స్పెయిన్ బుల్ గురువారం జేసన్ కబ్లర్ ను మట్టికరిపించాడు. వరుసగా రెండు సెట్లలో ఆధిపత్యం చెలాయించిన రఫా.. 6-1, 6-2తో కబ్లర్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. 'ఈ విజయం నాకెంతో ప్రత్యేకం. వరుసగా రెండు విజయాలు సాధించడం పట్ల చాలా సంతోషంగా ఉన్నా. మ్యాచ్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడాలని, నాదైన షాట్లతో విరుచుకుపడాలని అనుకున్నా. ఈ విజయంతో రేపు జరిగే మ్యాచ్‌లో ఆదే అవకాశం దక్కింది' అని మ్యాచ్ అనంతరం రఫా తెలిపాడు. పురుషుల సింగిల్స్‌లో మాజీ వింబుల్డన్ చాంపియన్ గ్రిగర్ దిమిత్రోవ్ 6-1, 6-2తో డానియెల్ ఆల్ట్‌మెర్‌పై గెలుపొందాడు. దిమిత్రోవ్ తర్వాతి మ్యాచ్‌లో వైల్డ్ కార్ట్ ఎంట్రీ రింకీ హిజికటాతో తలపడనున్నాడు. మహిళల విభాగంలో అజరెంక, జెలెనా ఒస్టపెంకో క్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. 34 ఏండ్ల అజరెంక ఫ్రాన్స్‌కు చెందిన కల్ఆర బురెల్‌ను 7-5, 6-2తో చిత్తు చేసింది. రెండో రౌండ్‌లో నవామి ఓసాకాను ఓడించిన మూడో సీడ్ ఒస్టపెంకో 6-2, 4-6, 6-3తో కరోలినా ప్లిస్కోవాపై గెలుపొందింది.

# బ్లేడ్ రన్నర్ పిస్టోరియస్‌కు పెరోల్..

## 11 ఏళ్ల తర్వాత జైలు నుంచి రిలీజ్



సెంచూరియన్: దక్షిణాఫ్రికా మాజీ పారాఒలింపియన్ ఆస్కార్ పిస్టోరియస్ జైలు నుంచి రిలీజయ్యాడు. గర్ల్‌ఫ్రెండ్ రీవా స్టీన్‌కెంప్‌ను మర్డర్ చేసిన కేసులో అతను 11 ఏళ్ల జైలుశిక్ష అనుభవించాడు. పెరోల్‌పై అతన్ని రిలీజ్ చేశారు. 2013లో గర్ల్‌ఫ్రెండ్‌ను తుపాకీతో కాల్చి చంపాడు. బత్రూమ్ డోర్ నుంచి ఆమెను షూట్ చేశాడు. దొంత అనుకుని షూట్ చేసినట్లు అతను కోర్టులో తెలిపాడు. ప్రస్తుతం పిస్టోరియస్ వయసు 37 ఏళ్లు. 2015లో అతను దోషిగా తేలాడు. పిస్టోరియస్ శిక్షాకాలం 2029లో ముగియనున్నది.

దక్షిణాఫ్రికా చట్టాల ప్రకారం శిక్షా కాలంలో సగం ముగిసిన తర్వాత ఎవరైనా పెరోల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. 2014 అక్టోబర్ నుంచి పిస్టోరియస్ జైలులో ఉంటున్నాడు. పుట్టిన ఏడాదికే అతని కాలును తీసివేయాల్సి వచ్చింది. అప్పటి నుంచి అతను ప్రోస్థటిక్స్ కాలుపై ఉంటున్నాడు. ఆ తర్వాత ప్రపంచ ప్రఖ్యాత రన్నరగా పేరుతెచ్చుకున్నాడు. అతన్ని బ్లేడ్ రన్నర్ అని పిలిచేవాళ్లు. ట్రాక్ ఈవెంట్లలో అతని కెరీర్ సక్సెస్‌ఫుల్‌గా సాగింది. పారా ఒలింపిక్స్‌లో అతను చాలా వరకు గోల్డ్ మెడల్స్ సాధించాడు. పెరోల్‌పై ఉన్న పిస్టోరియస్.. రోజులో కొన్ని గంటలు ఇంట్లోనే ఉండాలి. మద్యం సేవించరాదు. మీడియాతో మాట్లాడేందుకు కూడా అతనికి అనుమతి లేదు.

# దక్షిణాఫ్రికా గడ్డపై సంచలన విజయం



కొత్త ఏడాది ఆరంభంలోనే భారత జట్టు టెస్ట్ క్రికెట్ చరిత్రలో అద్భుతాన్ని ఆవిష్కరించింది. పేసర్లకు స్వర్గధామమైన కేప్‌టౌన్ లో సంచలన విజయంతో సిరీస్ కాపాడుకుంది.

రెండు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో టీమిండియా నయా చరిత్ర లిఖించింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యల్ప బంతుల్లోనే గెలుపొందిన జట్టుగా నిలిచింది. కేప్‌టౌన్‌లో భారత్ 107 ఓవర్లలో.. అంటే 642 బంతుల్లోనే విజయ ఢంకా మోగించింది. దాంతో, ఆస్ట్రేలియా పేరిట ఉన్న రికార్డును రోహిత్ సేన బద్దలు కొట్టింది.

గతంలో ఆస్ట్రేలియా 109.2 ఓవర్లనే దక్షిణాఫ్రికాపై గెలుపొందింది. 1932లో సఫారీలపై ఆసీస్ స్పిన్నర్ బెర్ట్ ఐరన్‌మాంగర్ 11 వికెట్లతో చెలరేగాడు. దాంతో, కంగారూ జట్టు 656 బంతుల్లోనే విజయం సాధించింది. 80 ఏండ్లుగా చెక్కు చెదరని ఈ రికార్డును కేప్‌టౌన్ టెస్టులో భారీ విజయంతో టీమిండియా బ్రేక్ చేసింది.

1934లో వెస్టిండీస్, ఇంగ్లండ్ మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్ 112 ఓవర్లలోనే ముగిసింది. 1888లో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మ్యాచ్‌లో 788 బంతుల్లోనే ఫలితం తేలిపోయింది. అదే ఏడాది ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య లార్డ్స్‌లో జరిగిన మ్యాచ్ 792 బంతుల్లోనే ముగిసింది.

కేప్‌టౌన్‌లో జరిగిన సిరీస్ డిసైడర్‌లో భారత బౌలర్లు బుమ్రా(8), సిరాజ్(7) వికెట్లతో చెలరేగారు. దాంతో, టీమిండియా 7 వికెట్ల తేడాతో సఫారీలను మట్టికరిపించి సిరీస్ సమం చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో మర్క్‌రమ్(106 103 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లు) వీరోచిత సెంచరీతో భయపెట్టినా.. బుమ్రా విజృంభణతో సఫారీ జట్టు 176 పరుగులకే కుప్పకూలింది. 79 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని టీమిండియా ఆడుతూ పాడుతూ 3 వికెట్ల నష్టానికి ఛేదించింది.

# ఓటమితో క్రికెట్‌కు వీడ్కోలు.. సఫారీ సారథికి టీమిండియా స్పెషల్ గిఫ్ట్



దక్షిణాఫ్రికా ఓపెనర్ డీన్ ఎల్గర్ ఓటమితో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. సొంతగడ్డపై కేప్‌టౌన్‌లో భారత్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఎల్గర్ నేతృత్వంలోని దక్షిణాఫ్రికా చిత్తుగా ఓడిపోయింది. దాంతో, సగర్వంగా కెరీర్‌ను ముగించాలనుకున్న అతడి కల ఫలించలేదు. అయితే.. ఆఖరి మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కడం ఎల్గర్‌కు పెద్ద ఊరట. కేప్‌టౌన్ టెస్టులో విజయం అనంతరం టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ సఫారీ సారథికి స్పెషల్ గిఫ్ట్ ఇచ్చాడు. కెరీర్‌లో చివరి మ్యాచ్ ఆడేసిన ఎల్గర్‌కు.. భారత జట్టు సభ్యులు సంతకాలు చేసిన జెర్సీని హిట్‌మ్యాన్ కానుకగా ఇచ్చాడు. మ్యాచ్ అనంతరం విరాట్ కోహ్లీ.. ఎల్గర్ తదుపరి జీవితానికి ఆల్ ది బెస్ట్ చెప్పాడు.సంతకం చేసిన జెర్సీని జ్ఞాపకంగా అందించాడు. సెంచూరియన్ టెస్టులో ఎల్గర్ శతకంతో చెలరేగాడు. 180 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే.. ఆఖరి మ్యాచ్‌లో మాత్రం ఎల్గర్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ (5, 12రన్స్)తో నిరాశపరిచాడు. కేప్‌టౌన్‌లో జరిగిన సిరీస్ డిసైడర్‌లో భారత జట్టు 7 వికెట్ల తేడాతో సఫారీలను మట్టికరిపించింది. మర్క్‌రమ్(106 : 103 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లు) వీరోచిత సెంచరీతో భయపెట్టినా.. బుమ్రా విజృంభణతో భారత్ పైచేయి సాధించింది. 79 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని టీమిండియా 3 వికెట్ల నష్టానికి ఛేదించింది.

# అత్యధిక గోల్స్‌తో రికార్డు.. మారడోనా అవార్డుకు ఎంపికైన రొనాల్డో




పోర్చుగల్ స్టార్ ఫుట్‌బాలర్ క్రిస్టియానో రొనాల్డో ప్రతిష్ఠాత్మక అవార్డుకి ఎంపికయ్యాడు. 2023లో అత్యధికంగా 54 గోల్స్ కొట్టినందుకు మారడోనా అవార్డు కు ఎంపికయ్యాడు.

దుబాయ్ గ్లోబ్ సాకర్ అవార్డ్స్ పండుగలో జనవరి 19వ తేదీన.. ఈ ఫార్వర్డ్ ప్లేయర్ బెస్ట్ గోల్ స్కోరర్ అవార్డును అందుకోనున్నాడు. 38 ఏండ్ల రొనాల్డో59 మ్యాచుల్లోనే 54 గోల్స్ సాధించాడు. ఈ స్టార్ ప్లేయర్ ఈ గతంలో ఐదు పర్యాయాలు టాప్ గోల్ స్కోరర్‌గా నిలిచాడు. 2011, 2013, 2014, 2015లో రొనాల్డో అత్యధిక గోల్స్ సాధించాడు. రొనాల్డోకు ఫ్రాన్స్ యువ కెరటం ఎంబాపే, ఇంగ్లండ్ స్టార్ హ్యారీ కేన్‌లతో పోటీ ఎదురైంది. కానీ, వాళ్లిద్దరూ.. 52 గోల్స్‌తో సంయుక్తంగా రెండో స్థానానికే పరిమితమయ్యారు. ఇంగ్లండ్ యంగ్‌స్టర్ ఎర్లింగ్ హాలాండ్ 50 గోల్స్‌తో మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. మరోవైపు వరల్డ్ కప్ విజేత లియోనల్ మెస్సీ మాత్రం 44 మ్యాచుల్లో 28 గోల్స్‌తో నిరాశపరిచాడు.

ఖతార్‌లో నిరుడు జరిగిన ఫిఫా వరల్డ్ కప్ రొనాల్డో కెరీర్‌ను మలుపుతిప్పిందనే చెప్పాలి. టోర్నీ ఆరంభానికి ముందు రోజు ఇంగ్లండ్ జర్నలిస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతడు మాంచెస్టర్ యునైటెడ్ క్లబ్ యాజమాన్యం తీరును తప్పుపట్టాడు. దాంతో, మాంచెస్టర్ క్లబ్ రొనాల్డోతో ఒప్పందం రద్దు చేసుకుంది. మెగా టోర్నీ అనంతరం ఈ స్టార్ ప్లేయర్‌ను అల్ నస్రీ క్లబ్ రికార్డు ధరకు సొంతం చేసుకుంది. రెండున్నర ఏండ్ల కాలానికి రూ. 4,400 కోట్లకు కాంట్రాక్టు కుదుర్చుకున్న విషయం తెలిసిందే.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**